బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 17 | సోమవారం | 01-07-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

## రూ. 12 వేల కోట్ల సమీకరణకు ఎన్‌టిపిసికి గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి)కి మంచి రోజులు వచ్చాయి. బాండ్లు, ఎన్‌సిడిల ద్వారా రూ. 12 వేల కోట్ల నిధులను సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపినట్లు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ వెల్లడించింది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ కింద విడతల వారీగా బాండ్లను విక్రయించ నున్నట్లు సెబీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ బాండ్ల టెన్యూర్, లిస్టింగ్ వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది.




బొగ్గు బ్లాక్‌లపై

# బిజెపి, బిఆర్‌ఎస్‌ది ఒకే వైఖరి

కేంద్ర సర్కార్ తీసుకువస్తున్న ఎంఎండిఆర్ చట్టానికి బిఆర్‌ఎస్ మద్దతు

మోదీని మించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అబద్ధాలు

తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు కృషి

మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/ ఖమ్మం

బొగ్గు బ్లాకుల విషయంలో బిజెపి, బిఆర్‌ఎస్ ది ఒక్కటే వైఖరి అని, బిజెపి ఎంఎండిఆర్ చట్టాన్ని తీసుకు వస్తుంటే బిఆర్‌ఎస్ మద్దతునిచ్చిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్త గూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బొగ్గు బ్లాకుల వేలం రాష్ట్రంలో బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మొదలైందని కోయగూడెం అరవిందో కంపెనీకి మరో చోట అవంతి కంపెనీకి కట్టబెట్టి ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతలు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆయన తెలిపారు. బొగ్గు బావుల విషయంలో బిజెపి కి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంలో మోదీనే మించి పోయారన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశ నిర్ణయాలను ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలకు బొగ్గు ఉత్పత్తిని అప్పగించినప్పుడు తెలంగాణలో ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. చట్ట విరుద్ధమైన బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకుంటామన్నారు. వేలాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జూలై ఐదు నుంచి ఆందోళనలు చేస్తామని సాంబశివరావు తెలిపారు. జూలై ఐదున కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో ఆందోళనలు చేస్తామని బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకునేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని సాంబశివరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఒకటిన కలెక్టరేట్లను ముట్టడించాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు సిపిఐ ప్రణాళికా తరువాయి 2లో

# పార్లమెంట్‌లో నీట్ తుపాన్!

పరీక్షా పేపర్ లీకేజీ, అగ్నిపథ్, ద్రవ్యోల్బణంపై అట్టుడకనున్న ఉభయసభలు

పలు అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ సమావేశాలు సోమవారం తిరిగి ప్రారంభం కానున్నాయి. అయితే నీట్ పరీక్షా పేపర్ లీకేజీ వివాదం, అగ్నిపథ్ పథకం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై ఉభయసభల్లో వాడివేడిగా చర్చ జరగనుంది. ప్రజా సమస్యలపై విపక్ష సభ్యులు అధికార పక్షాన్ని నిలదీయనుంది. పేపర్ లీక్ వ్యవహారంతో పాటు నిరుద్యోగ సమస్యను కూడా ప్రతిపక్షాలు లేవనెత్తే అవకాశం ఉంది. లోక్‌సభలో బిజెపి సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ప్రారంభించనున్నారు. ఈ తీర్మానాన్ని బిజెపి అగ్రనేత, దివంగత సుష్మా స్వరాజ్ కుమార్తె, మొదటి సారి లోక్‌సభకు ఎన్నికైన బన్సూరి స్వరాజ్ సమర్థించనున్నారు. ధన్యవాద తీర్మానంపై చర్చకు లోక్‌సభ 16 గంటల సమయం కేటాయించగా, మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ సమాధానంతో ముగియనుంది. అదే విధంగా రాజ్యసభలో చర్చకు 21 గంటల సమయం కేటాయించగా, ప్రధాని బుధవారం సమాధానం చెప్పే అవకాశం ఉంది. కాగా, పార్లమెంట్ సమావేశాలు ఈనెల 24వ తేదీన ప్రారంభం కాగా, సభ్యుల ప్రమాణం స్వీకారం, రాష్ట్రపతి ప్రసంగం, స్పీకర్ ఎన్నిక వంటి కార్యక్రమాలు ముగిశాయి. అయితే రాష్ట్రపతికి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు ముందు నీట్ చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ తరువాయి 2లో



బలమైన ప్రతిపక్షంతో మోదీ సర్కార్

## విధానాలు మార్చుకోక తప్పదు

సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

బిజెపి విధానాలు దేశానికి ప్రమాదకరమని, కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. అతి కొద్ది కార్పొరేట్లకు అనుకూలంగా బిజెపి తన విధానాలను అమలు చేస్తుందని, దేశ సంపదను దోచిపెట్టడమే గాక ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించే పనిలో దుస్సాహసానికి పాల్పడుతుందని ఆయన తెలిపారు. ఖమ్మంలో జరిగిన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో తరువాయి 2లో



లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవికి

## పోటీలో అవదేశ్ ప్రసాద్

ఇండియా కూటమి యోచన

**న్యూఢిల్లీ :** లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌గా సమాజ్‌వాదీ పార్టీ ఎంపి అవదేశ్ ప్రసాద్‌ను పోటీ పెట్టాలని విపక్ష 'ఇండియా' కూటమి భావిస్తోంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య నగరం అంతర్భాగంగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫైజాబాద్ నియోజకవర్గం నుండి ఆయన సంచలన విజయం సాధించారు. ఆయననే డిప్యూటీ స్పీకర్ పదవికి పోటీ పెట్టేందుకు రెండు అంశాలను విపక్షాలు పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. అందులో ఒకటి బిజెపి తరువాయి 2లో



## స్మార్ట్ సిటీ మిషన్ గడువు పొడిగింపు

సిఎం రేవంత్ రెడ్డి చొరవతో స్పందించిన కేంద్రం

ప్రజాపక్షం/ హైదరాబాద్/కరీంనగర్ ప్రతినిధి

స్మార్ట్ సిటీ మిషన్‌ను 2025 మార్చి వరకు పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈ నెల 24న సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితిని వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి జూన్ నెలాఖరుతో ముగియనుంది. రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో స్మార్ట్ మిషన్ పనులు చేపట్టారు. వరంగల్‌లో ఇప్పటివరకు 45 పనులు పూర్తయ్యాయి. రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయి. కరీంనగర్ లో 25 పనులు పూర్తి కాగా రూ.287 కోట్లతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయి. ఈ విషయాలను ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి తరువాయి 8లో

## త్వరలో కాంగ్రెస్‌లోకి సబితా ఇంద్రారెడ్డి !

బిఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల్లో చర్చ

ఆమె కుమారుడు కార్తీక్‌రెడ్డి కూడా!

కీలక పదవి ఇచ్చే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్



కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ స్పీడ్ అందుకుంది. ఎంఎల్‌ఎలు, పలువురు నాయకులు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరుతుండడంతో బిఆర్‌ఎస్ విలవిల్లాడుతోంది. తాజాగా బిఆర్‌ఎస్‌కు మరో ఎదురుదెబ్బ తగులుతోంది. మాజీ మంత్రి, రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం నియోజకవర్గం ఎంఎల్‌ఎ పి.సబితా ఇంద్రారెడ్డి సైతం పార్టీ మారేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్‌లో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, అషాఢ మాసం ప్రారంభంలోనే ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. ఇటీవల నియోజకవర్గ పర్యటనలో మంత్రి పదవిపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. 'హోమ్ విద్యాశాఖలను మీ కోసమే ఖాళీగా ఉంచారేమో మేడమ్. మీరు వెళ్తే మీకే ఆ శాఖ ఇస్తారేమో' అని ఒకరు నవ్వుతూ వ్యాఖ్యానించగా తరువాయి 2లో



## పబ్బుల్లో ఆకస్మిక తనిఖీలు

డ్రగ్స్ నియంత్రణలో స్నిఫర్ డాగ్స్

ప్రజాపక్షం/హైదరాబాద్

డ్రగ్స్ తనిఖీలలో పోలీసులు కొత్త వరవడికి శ్రీకారం చుట్టారు. డ్రగ్స్‌ను పసిగట్టేందుకు నార్కోటిక్ బ్యూరో పోలీసులు శిక్షణ ఇచ్చిన స్నిఫర్ డాగ్స్‌ను రంగంలోకి దించారు. ఈ ప్రత్యేక జాగిలీల ద్వారా ఆదివారం సాయంత్రం పోలీసులు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిధిలో ఉన్న వివిధ పబ్బుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీసులతో పాటు జాగిలాలు ఒక్కసారిగా పబ్బుల్లో దర్శనమివ్వడంతో పబ్బు నిర్వాహకులు, వినియోగదారులు ఒక్కసారిగా అవాకయ్యారు. ఒక్కో పబ్బులో సుమారు రెండు గంటల పాటు జాగిలాల సహాయంతో తనిఖీ నిర్వహించారు. అయితే ఈ సందర్భంగా ఎక్కడా కూడా డ్రగ్స్ అనవాళ్లను గుర్తించలేదు. ఇలా చేయడం ద్వారా పబ్బులలో డ్రగ్స్‌ను అరికట్టవచ్చని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి తనిఖీలు మునుముందు కూడా ఆకస్మికంగా జరుతాయని అన్నారు. పబ్బులలోనే కాకుండా ఫంక్షన్ హాల్స్, ఫాంహౌజ్‌లు, గెట్టుగెదర్ తరువాయి 2లో

# తెలంగాణ వాదనను పట్టించుకోరా?

పోలవరంపై ఏపి వడివడిగా ముందుకే...

సిడబ్ల్యూసికి మరోసారి తెలంగాణ వాదనలు వినిపించే అవకాశం !!

ప్రజాపక్షం / హైదరాబాద్



పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌పై తెలంగాణ చేస్తున్న ఆందోళనలను కేంద్రం పట్టించుకోవడం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు రెండో సారి కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి)కు దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పోలవరం బ్యాక్ వాటర్‌పై సంయుక్త సర్వేను పరిష్కరించాలని కోరింది . పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాలు, డ్రైనేజీలు, పూడిక, పూడికతీత, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ ముంపునకు గురికావడం, వరద రక్షణ చర్యలపై గత రెండేళ్లుగా అప్పటి తెలంగాణ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పలు సమావేశాల్లో లేవనెత్తుతోంది. ఆంధ్రప్రదేశ్ నుండి ఎటువంటి చర్యలు లేవని, తెలంగాణ ఆందోళనలు , వరద రక్షణ చర్యలపై పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పిపిఎ) సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో సిడబ్ల్యూసికి మరో సారి తెలంగాణ ఇరిగేషన్ శాఖ రాష్ట్ర వాదనలు వినిపించే అవకాశం ఉంది. కాగా తెలంగాణ వాదనలు ఇలా ఉంటే.. అటు ఏపి మాత్రం పోలవరంపై వడివడిగా ముందుకు సాగుతోంది. ఈ మేరకు ఏపిలోని పోలవరంలో కీలక సాంకేతిక సవాళ్లను పరిష్కరించేందుకు అంతర్జాతీయ జలవనరుల నిపుణుల బృందం ప్రాజెక్టును ఆదివారం పరిశీలిచింది. అమెరికా, కెనడా తదితర దేశాల నుంచి నలుగురు నిపుణులు ఢిల్లీకి చేరుకుని అటునుండి ఏపికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో ముందుగా ఢిల్లీలో నిపుణులు బృందం సమావేశం అయ్యారు. అనంతరం రాత్రి రాజమండ్రికి చేరుకున్న నిపుణులు పోలవరం ప్రాజెక్టు వద్ద అధికారులతో భేటీ అనంతరం ప్రాజెక్ట్ సైట్‌ను పరిశీలించారు. దీనితో పాటు అక్కడి అధికారులను అడిగి ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్నారు. కెనడాకు చెందిన నలుగురు నిపుణులు శనివారం దిల్లీకి చేరుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి పోలవరంలో పనిని ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ నిపుణులు అక్కడే ఉంటారు. మొదటి రెండ్రోజుల పాటు ప్రాజెక్టును వారు పూర్తిగా పరిశీలిస్తారు. ప్రతి కట్టడాన్ని క్షుణ్ణంగా పరిశీలించేలా ఇప్పటికే పర్యటన షెడ్యూల్ సిద్ధమైంది. ఆ తర్వాత మరో రెండ్రోజుల పాటు సమస్యల పరిష్కారాలపై మేధోమథనం చేయనున్నారు. ఇందులో పోలవరం తరువాయి 2లో

డిఎస్‌కు కన్నీటి వీడ్కోలు



శ్రీనివాస్ మృతదేహానికి సిఎం రేవంత్ రెడ్డి నివాళి

విద్యార్థుల సంఖ్య ఆధారంగానే

## 'టీచర్ల' కేటాయింపు

కనీసం పది మంది విద్యార్థులకు ఒక టీచర్

61 మంది విద్యార్థులు దాటితే మంజూరైన పోస్టుల భర్తీ

గతంలో జరిగిన పొరపాట్లు, లోపాలకు స్వస్తి

కొత్తగా నిబంధనలు రూపొందించిన విద్యాశాఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లు, లోపాలను సవరించారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఎక్కువ మంది,ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనుంది. పాఠశాల విద్యాబోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచేలా ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగానే కొత్త నిబంధనలను రూపొందించారు. విద్యార్థుల సంఖ్యతో పాటు మెరుగైన విద్యా బోధనను దృష్టిలో పెట్టుకుని ఆయా పాఠశాలలకు పోస్టులను కేటాయించారు. దీనికి అనుగుణంగానే ఆయా పాఠశాలలకు మంజూరైన పోస్టులను భర్తి చేసేలా వెబ్‌ఆప్షన్లను కేటాయించారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ పదోన్నతులను ప్రభుత్వం ఇటీవలే తరువాయి 8లో

## అమల్లోకి కొత్త చట్టాలు




**న్యూఢిల్లీ :** బ్రిటిష్ వలస పాలన కాలంనాటి చట్టాలకు ముగింపు పలుకుతూ న్యాయ వ్యవస్థలో కీలక మార్పులను తీసుకువస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి రానున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం సోమవారం దేశ వ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులతో జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మోడ్‌ల ద్వారా సమన్లు జారీ చేయడం, క్రూరమైన నేరాలకు సంబంధించిన నేర దృశ్యాలను తప్పనిసరి వీడియోగ్రఫీ వంటి నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఉగ్రవాదానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వటమే కాకుండా రాజద్రోహం పదాన్ని తొలగించారు. భారతీయ న్యాయ సంహితలో రాజద్రోహం స్థానంలో దేశద్రోహం అనే కొత్త పదాన్ని చేర్చారు. రాజ్యాంగ ఆదర్శాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సమాజంలో నేరాలను త్వరగా పరిష్కరించేందుకు ఈ మార్పులు దోహదపడతాయని కేంద్ర ప్రభుత్వ అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**'శిక్షల కంటే న్యాయం కోసమే'**

కొత్త చట్టాలు పౌరులకు శిక్షలు విధించడం కంటే న్యాయం అందించడానికి ప్రాధాన్యం ఇస్తాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. వలసవాద నేర న్యాయ చట్టాల ముగింపును సూచిస్తూ, అందరికీ న్యాయం చేయాలన్న తలంపుతో కొత్త చట్టాలు అమల్లోకి తరువాయి 8లో

# పోటీ నుండి తప్పుకోవాలని బైడెన్‌పై పెరుగుతున్న ఒత్తిడి

## 'డియర్ బైడెన్... తప్పుకో': చిన్ననాటి స్నేహితుడి లేఖ

### కుటుంబసభ్యులతో చర్చించేందుకు క్యాంప్ బెల్‌కు వెళ్ళిన బైడెన్

నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా రెండవసారి అధ్యక్ష పదవి రేసులో ఉన్న ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పోటీ నుండి తప్పుకోనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ఇటీవల గత గురువారం నాడు ఆయన తన ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన ముఖాముఖిలో ఘోరంగా విఫలమయ్యారు. చర్చ సందర్భంగా పలుమార్లు తడబడడం, కొన్ని విషయాలు మరిచిపోవడం, పీల గొంతుతో మాట్లాడడం ఆయన మద్దతుదారులనే తీవ్ర నిరాశ పరిచింది. ఇలాగైతే ఎన్నికల్లో డెమొక్రాట్‌లు గెలవడం కష్టమేనని ఆ పార్టీ వాళ్ళే భావిస్తున్నారు. దీంతో జోబైడెన్ బరి నుండి తప్పుకోవాలని డెమొక్రాట్ పార్టీ దాతలు, సభ్యులు భావిస్తున్నారు. కొంత మంది దాతలు తమ విరాళాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.నియమావళి ప్రకారం పార్టీ ఇప్పుడు అభ్యర్థిని మార్చే అవకాశం లేదు. స్వయంగా బరిలో ఉన్న అభ్యర్థే తప్పుకోవాల్సి ఉంటుంది. దీంతో జో బైడెన్ పై తీవ్ర వత్తిడి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆయన క్యాంప్ డేవిడ్‌కు వెళ్ళారు. అక్కడ ఆయన తన కుటుంబసభ్యులతో పోటీ విరమణ అంశంపై కూడా చర్చించే అవకాశం ఉందని మీడియా కథనాలు వెలువడ్డాయి.

ప్రపంచం



### పోటీ నుండి తప్పుకో మిత్రమా

అమెరికా జో బైడెన్ చిన్ననాటి స్నేహితుడు, దీర్ఘకాలిక మద్దతుదారుడు జే పరిని కూడా ఆయనను పోటీ నుండి తప్పుకోవాలని సూచించారు. ఈ మేరకు బైడెన్‌కు ఆయన రాసిన భావోద్వేగపూరిత లేఖ 'సిఎన్ఎన్'లో ప్రచురితమైంది. బైడెన్‌కు జే పరిని తల్లి బేబీ సిట్టర్‌గా వ్యవహరించేవారు. దేశం భారీ సంక్షోభంలో ఉన్నప్పుడు బైడెన్ నేతృత్వంలో సాధించిన విజయాలను జే కొనియాడారు. ముఖ్యంగా మహమ్మారి సమయంలో ఆర్థిక సంక్షభం తలెత్తినప్పుడు బైడెన్ వ్యవహరించిన తీరు, గన్ సంస్కృతిని నియంత్రించడం, మౌలికసదుపాయాలను పెంపొందించడం, నేరాలను నియంత్రించడం, ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం వంటి చర్యలను ఆయన ప్రస్తావించారు. ఉక్రేన్‌కు విజయవంతంగా మద్దతు కూడబెట్టినందుకు ప్రశంసించారు. అదే సమయంలో ఇటీవల మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన ముఖాముఖిలో బైడెన్ తీరుపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. జీరబోయిన గంతు, తరచు వణకడం,మధ్య మధ్యలో మరిచిపోవడం, వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని, 82 సంవత్సరాలకు చేరువవుతున్న సమయంలో అధ్యక్ష పదవికి మీరు సరైన ఎంపిక కాబోరని బైడెన్‌కు జే సలహా ఇచ్చారు. అధ్యక్షుడిగా మరొక విడతలో దేశాన్ని ఏ మేరకు విజయవంతంగా ముందుకు తీసుకెళ్తారనే అంశంపైఆందోళన ఉందన్నారు. 'నీవు ఇప్పుడు నాలాగే వృద్ధుడవు. మన శరీరాలు ఒకప్పటి లాగా సహకరించబోవు. కొన్ని సార్లు ఉదయమే లేవడానికి కూడా ఇబ్బంది పడుతుంటామని' పేర్కొన్నారు. దేశ భవిష్యత్తునుపై దృష్టిలో పెట్టుకోవాలని, మరొక చురుకైన డెమోక్రాటిక్ అభ్యర్థి కోసం పోటీ నుండి వైదొలిగి చరిత్రలో నీదైన ముద్ర వేయాలని కోరారు. అలా జరగకపోతే ట్రంప్ గెలిచే ప్రమాదముందని, అప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ట్రంప్ గెలిస్తే ఉక్రేనియన్‌లపై విరుచుకుపడేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు స్వేచ్ఛ ఇచ్చినట్లు అవుతుందని, అలాగే ఇజ్రాయిల్ ప్రధానికి నెతన్యాహూకు బ్లాంక్ చెక్ ఇచ్చినట్లవుతుందని అన్నారు. గవర్నర్ గ్రెచెన్ విట్మర్, గావిన్ న్యూసమ్, జె.బి.ప్రిట్జ్‌కర్ వంటి బలమైన అభ్యర్థులలో ఒకరిని ట్రంప్‌పై పోటీలో పెట్టాలని సూచించారు.

# 'ఆసియా నాటో'లా ఆ మూడు దేశాలు : ఉత్తర కొరియా

### దక్షిణకొరియా, అమెరికా, జపాన్ సంయుక్త విన్యాసాలపై మండిపాటు



దక్షిణ కొరియా, జపాన్, అమెరికాల సంయుక్త మిలిటరీ విన్యాసాలను 'ఆసియా తరహా నాటో' అని ఉత్తరకొరియా విమర్శించింది. దీనికి ప్రాణాంతక ప్రతిచర్యలు తప్పబోవని హెచ్చరించింది. వార్షిక విన్యాసాలు నిర్వహించాలని గత ఏడాది అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ అధినేతలు త్రైపాక్షిక సమావేశంలో నిర్ణయించారు. ''డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా(డిపిఆర్‌కె)కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే మిలిటరీ బలప్రదర్శన చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామ'ని ప్యాంగ్యాంగ్ విదేశాంగ మంత్రి ఆదివారం కెసిఎన్ఎ వార్తా సంస్థకు అధికారిక ప్రకటనలో పేర్కొంది. 'అమెరికా–జపాన్–ఆర్‌ఒకె సంబంధాలు పూర్తి స్థాయి ఆసియా తరహా నాటో మాదిరిగా కనిపిస్తున్నాయ'ని, ఇది ప్రాణాంతక ప్రతిచర్యలకు దారి తీస్తుందని హెచ్చరించింది. 'అమెరికా, దాని అనుచరులు తమ మిలిటరీ విభాగాలను బలోపేతం చేసుకునే చర్యలను డిపిఆర్‌కె పట్టించుకోకుండా ఏనాడు లేదని తెలిపింది. మూడు దేశాల తాజా విన్యాసాలలో వాషింగ్టన్ న్యూక్లియర్ సహిత ఎయిర్‌క్రాఫ్ట్ యుఎస్ఎస్ థియోడర్ రూస్‌వెల్ట్, టోక్యోకు చెందిన లక్షిత క్షిపణి విధ్వంసిని జెఎస్ అలాగో, సియోల్‌కు చెందిన కెఎఫ్–16 ఫైటర్ జెట్‌లు పాల్గొన్నాయి. సంయుక్త విన్యాసాలను తమపై దండయాత్రకు అభ్యాసం లాంటిదని ప్యాంగ్యాంగ్ గతంలోనే విమర్శించింది. రష్యాతో ఉత్తర కొరియాకు పెరుగుతున్న సంబంధాల పట్ల దక్షిణ కొరియా ఆందోళన వ్యక్తం చేస్తుంది.

# నైజీరియాలో బాంబు పేలుళ్ళు: 18 మంది దుర్మరణం

### వివాహవేడుక, ఆసుపత్రి, అంతిమయాత్రలో ఆత్మాహుతి పేలుళ్ళు



నైజీరియా దేశంలోని ఈశాన్యరాష్ట్రం బోర్నోలో జరిగిన బాంబు పేలుళ్ళలో 18 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 48మంది తీవ్రంగా గాయపడ్డారు. మొదటి పేలుడు ఒక వివాహ కార్యక్రమంలో సంభవించింది. మరొక పేలుడు గ్వోజా జనరల్ ఆసుపత్రి, మూడవ పేలుడు శవయాత్రలో సంభవించింది. ఈ ఘటనకు కారణాలపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఆత్మాహుతి దళాలే వరుస పేలుళ్ళకు కారణమని వార్తలు వస్తున్నాయి. వివాహ కార్యక్రమంలో ఒక మహిళ , ఒక పిల్లవాడిని నడుము కట్టుకొని బాబు పేలుళ్ళకు పాల్పడినట్లు సమాచారం అందుతోంది. బోర్నో స్టేట్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (సెమా) ప్రకారం 18 మంది మృతుల్లో పిల్లలు, పురుషులు, మహిళలు, గర్భిణులు ఉన్నారు. బోకో హరామ్ సంస్థ పేలుళ్ళ వెనుక ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.



ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీకి జరుగుతున్న ఆకస్మిక ఎన్నికల తొలిరౌండ్ పోలింగ్ సందర్భంగా ఆదివారం పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఫ్రెంచ్ ఓటర్లు

# గాజాలో మరింత ఉధృతమైన పోరు

### జనావాసంపై పేలుడు.. ఆరుగురి దుర్మరణం..



ఉత్తర, దక్షిణ గాజాలో ఇజ్రాయిల్, పాలస్తీనా బలగాల మధ్య తీవ్ర యుద్ధం జరుగుతుంది. రఫాలోని ఒక ఇంటిపై జరిపిన పేలుడులో చిన్నారులు సహా ఆరుగురు సామాన్య పౌరులు మరణించారు. కాల్పుల విరమణ చర్చలలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. అయితే శాశ్వత కాల్పుల విరమణతో కూడిన ఎలాంటి ప్రతిపాదననైనా సానుకూలంగా పరిశీలించేందుకు హమాస్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరో వైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిలీల కోసం వేలాది గృహాల నిర్మాణానికి ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రణాళికపై ఆమోద ముద్ర వేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఆక్రమిత పాలస్తీనాలో ఇజ్రాయిల్ అక్రమ నిర్మాణాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ ఆ దేశం పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది. ఈ నిర్మాణాలను పూర్తి చేయడమే తమకు అత్యంత ప్రాధాన్యత అంశమని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ముందుకు సాగుతున్నారు.

# నీట్ తుపాన్!

(మొదటి పేజీ తరువాయి

చేశారు. ఉభయసభల్లోనూ వెల్‌లోకి వెళ్లి నిరసనలు తెలపడంతో పార్లమెంట్ దద్దరిల్లింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులతో ఎన్‌టిఎ మే 5న నీట్ యుజి నిర్వహించింది. జూన్ 4న ఫలితాలు ప్రకటించగా, బీహార్ వంటి రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, ఇతర అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఇదిలా ఉండగా, రాజ్యసభలో చర్చను ప్రారంభిస్తూ, బిజెపి సభ్యుడు సుధాన్షు త్రివేది మోదీని 'అతుల్నియా' (అసమానమైన) అని అభివర్ణించారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలతో వ్యవహరించే విషయంలో, మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన విధానంలో చాలా తేడా ఉందన్నారు. బిజెపి సభ్యురాలు కవితా పాటిదార్ ఈ తీర్మానాన్ని బలపరిచారు. చర్చలో ఇప్పటివరకు తొమ్మిది మంది పాల్గొన్నారు. నీట్ అంశంపై ప్రత్యేక చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సభలో శుక్రవారం చర్చను చేపట్టాల్సి ఉండగా, ప్రతిపక్ష ఇండియా బ్లాక్ సభ్యుల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. నీట్‌పై చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు రాజ్యసభలో పెద్దఎత్తున ఆందోళన చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే తోటి సభ్యులతో కలిసి వెల్‌లోకి దూసుకెళ్లారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కాంగ్రెస్ సభ్యుడు ఫూలో దేవి నేతమ్ రాజ్యసభలో నినాదాలు చేస్తూ స్పృహతప్పి పడిపోయారు. దీంతో ఆయనను రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. అయితే సభ్యుడి స్పృహ తప్పి పడిపోయాని సభా కార్యక్రమాలను వాయిదా వేయకుండా కొనసాగించారని, రాజ్యసభ సభ్యుడి ఆరోగ్యంపై ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీశారు.

# కాంగ్రెస్‌లోకి సబితా ఇంద్రారెడ్డి!

(మొదటి పేజీ తరువాయి

మంత్రి పదవి కావాలంటే అదృష్టం ఉండాలని, నుదుటి రాత బాగాలేకుంటే ఏమీ చేయలేమని సబితా ఇంద్రారెడ్డి సరదాగా బదులిచ్చారు. అయితే బిఆర్ఎస్ అధికారంలో లేనందున మంత్రి పదవి సాధ్యం కాదని చెప్పకుండా అదృష్టం ఉండాలని ఆమె వ్యాఖ్యానించడంతో త్వరలోనే ఆమె కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆమె అనుచరులలో చర్చ జరుగుతున్నది.

**కుమారుడికి సైతం కీలక పదవి!**

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో సబితా ఇంద్రారెడ్డి హోం మంత్రిగా పనిచేశారు. 2019లో కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి దక్కించుకున్నారు. అయితే బిఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఆమె పార్టీ మారేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఆమె కుమారుడు కార్తిక్ రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరబోతున్నారని, ఆయనకు నామినేటెడ్ పోస్టును కూడా కాంగ్రెస్ ఆఫర్ చేసిందనే ప్రచారం జరుగుతోంది.

**మరోసారి పట్నం, పట్లోళ్ల కాంబినేషన్**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయల్లో పట్నం, పట్లోళ్ల ఫ్యామిలీలదే ఆధిపత్యం. ఏ పార్టీ పవర్ లో ఉన్నా ఈ రెండు కుటుంబాల్లో ఎవరో ఒకరు అధికార పక్షంలో ఉండటం గ్యారెంటీ. అయితే 2019 తర్వాత ఈ సీన్ మారింది. పట్నం మహేందరెడ్డి, పట్లోళ్ల సబితా ఈ ఇద్దరూ బిఆర్ఎస్‌లో చేరడంతో రెండు కుటుంబాలు అధికార పక్షంలో ఉన్నాయి. అయితే ఇటీవల పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా తాజాగా సబితా ఇంద్రారెడ్డి సైతం కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో ఈసారి పట్నం, పట్లోళ్ల కాంబినేషన్ కాంగ్రెస్‌లోనూ ఉండబోతున్నదనే చర్చ జిల్లాలో వినిపిస్తోంది.

# పబ్బుల్లో ఆకస్మిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలు నిర్వహించే స్థలాలలో కూడా జాగిలాలను ఉపయోగిస్తామని పోలీసులు అంటున్నారు. డ్రగ్స్ ఎక్కడ దాచిపెట్టినా జాగిలాలు వాసనను పసిగడుతాయని చెబుతున్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని కార్యచరణ మొదలుపెట్టారు. ఒకపక్క శాంతి భద్రతల పోలీసులు, మరోపక్క నార్కోటిక్ బ్యూరో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు.

# ఒకే వైఖరి

(మొదటి పేజీ తరువాయి

బద్ధంగా ముందుకు సాగుతుందని అందుకు తగిన కార్యాచరణ రూపొందించనున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీ అంతర్భాగంగా ఉందని చైతన్య వంతమైన ఈ రాష్ట్రంలో బిజెపికి అవకాశం దక్కదన్నారు. నిర్మాణం లేకుండా సెంటిమెంట్ పై ఆధారపడిన బిఆర్ఎస్ అధికారంలో లేకుండా బతకడం కష్టమని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్ లేదా ఇతర రాజకీయ పక్షాలకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు సిపిఐకి అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఉమ్మడి 10 జిల్లాల్లోను కమ్యూనిస్టు పార్టీకి నిర్మాణం ఉందని దానిని మరింత విస్తృత పరిస్తే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు. బలమైన ప్రాంతాలను పార్టీ విస్తృతికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పొత్తులు అనివార్యమవుతున్నాయని కాని ఇదే సమయంలో ఇతరులపై ఆధారపడే అవకాశం రాకుండా భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తున్నామని కూనంనేని తెలిపారు. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కమ్యూనిస్టులు బలంగా ఉన్న చోట కాంగ్రెస్‌భారీమెజార్టీతో విజయం సాధించిందని కమ్యూనిస్టులు బలహీనంగా ఉన్నచోట బిజెపి గెలిచిందన్నారు. కాంగ్రెస్ సైతం ఈ వాస్తవాన్ని గుర్తించాలని పలుకుబడి కలిగి ప్రజల్లో సానుకూల భావనతో ఉన్న కమ్యూనిస్టులను గుర్తించాలని డిఎంకె మాదిరి మిత్ర పక్షాలకు కూడా సరైన అవకాశాలు కల్పించాలని కూనంనేని సూచించారు.

**కమ్యూనిస్టుల కార్యక్రమాల వల్లనే :**

కమ్యూనిస్టుల కార్యాచరణ, బిజెపి వ్యతిరేక ప్రచారం నిర్వహించడం వల్లనే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా తగ్గిందని సాంబశివరావు తెలిపారు. బిజెపి మతోన్మాద ప్రచారాన్ని తిప్పికొడుతూ దేశ వ్యాప్తంగా ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగించడం జరిగిందని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అంశాల వారీగా మద్దతునిస్తూనే ప్రజా సమస్యలు ముఖ్యంగా సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం, రైతులు, కూలీలు, మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బిజెపియేతర రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు సిపిఐ సిద్ధమవుతుందన్నారు. ఇందు కొరకు ఒక పక్క ఆందోళనలు మరో పక్క సైద్ధాంతిక శిక్షణ ప్రచారాలను ముమ్మరం చేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో తీసుకున్న కార్యాచరణను అమలు చేస్తూ హన్మకొండలో పార్టీ నిర్మాణ కౌన్సిల్‌ను నిర్వహించాలని నిర్ణయించడంజరిగిందని సాంబశివరావు తెలిపారు. మీడియా సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయసమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు, పర్వ పద్మ, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాల మల్లేష్, బాల నర్సింహా, కె. శంకర్‌పాల్గొన్నారు.

# విధానాలు మార్చుకోక తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను నివేదించారు. ప్రజల్లో బిజెపి పట్ల వ్యతిరేకత మొదలైందని, కాని ఓడించే స్థాయికి చేరుకోలేదని, బలమైన ప్రతిపక్షంతో బిజెపి తన విధానాలను మార్చుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని అజీజ్ పాషా అన్నారు. మతోన్మాద చర్యల నుంచి తిరోగమన బాట పట్టక తప్పదని, ఇప్పటికైనా రాజ్యాంగాన్ని గౌరవిస్తూ లౌకిక వాదాన్ని కాపాడాలన్నారు. బిజెపి వ్యతిరేక ప్రచారంలో కమ్యూనిస్టులు ముందు వరుసలో నిలిచారని, దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు బలమైన కేంద్రాల్లో మోదీ, ఎన్‌డిఎకు గట్టి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. కాంగ్రెస్ మరింత విశాల దృక్పథంతో మిత్ర పక్షాలను కలుపుకునిపోయి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పాషా అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎన్నో ఆశలు ఉన్నాయని, ఆ ఆశలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం అమలులో వేగాన్ని పెంచాలని అజీజ్ పాషా సూచించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను ప్రజలు విశ్వసించారని, ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా హామీల అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ.2,500 నగదు బదిలీ, ఆర్థిక చేయూత, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, పింఛన్ల విషయంలో ఇచ్చిన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. కాంగ్రెస్ రాజకీయ నిర్ణయాలు సైతం బిఆర్ఎస్‌తో కొన్ని సరిపోలుతున్నాయని చెప్పారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు, ప్రజాప్రతినిధుల కంటే ప్రజలు విపక్షంగా మారకుండా చూసుకున్నప్పుడే అధికార పార్టీ మనుగడ కొనసాగుతుందని పాషా తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో కమ్యూనిస్టు శక్తులు పురోగమిస్తున్నాయని ఆయన తెలిపారు. సంఖ్యా బలం కంటే ప్రజల ఆలోచనల్లో కమ్యూనిస్టు సానుకూల దృక్పథం పెరుగుతుందని కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. కొందరు కుహనా మేధావులను పక్కన పెడితే మేధావి వర్గం సైతం కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించి ప్రజలకు మేలు జరగాలంటే కమ్యూనిస్టులు ఉండాలన్న ప్రచారాన్ని ముందుకు తేవడం అత్యంత సానుకూల పరిణామమని పాషా తెలిపారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీని విస్తరించేందుకు సమిష్టి కృషి జరగాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి ఆందోళనలకు కార్యకర్తలను సమాయత్తం చేయాలని అజీజ్ పాషా పిలుపునిచ్చారు. పాలకులు ఎవరైనా ప్రజలే ముఖ్యమని, ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ఎజెండా కావాలని ఆయన సూచించారు. పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె. సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోటీలో అవదేశ్ ప్రసాద్

(మొదటి పేజీ తరువాయి

ఘనంగా ప్రచారం చేసుకున్న అయోధ్య రామమందిరం ఉన్న నియోజకవర్గంలో గెలుపొందడం, రెండవది, జనరల్ స్థానం నుండి దళితుడైన అవదేశ్ గెలుపొందడం. అవదేశ్ అనుభవం కూడా ఘనంగానే ఉంది. ఆయన తొమ్మిది సార్లు ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభకు, ఇటీవల లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను డిప్యూటీ స్పీకర్ స్థానానికి పోటీ చేయించడం ద్వారా దేశవ్యాప్త చర్చకు తెరలేస్తుందని కూటమి భావిస్తుంది. అవదేశ్ ప్రసాద్ అభ్యర్థిత్వాన్ని తృణమూల్ కాంగ్రెస్ ప్రతిపాదించినట్లు తెలిసింది. టిఎంసి ప్రధాన కార్యదర్శి, ఎంపి అభిషేక్ బెనర్జీ ఇప్పటికే ఈ అంశంపై ప్రతిపక్ష కూటమిలోని వివిధ పక్షాలతో, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్‌లతో చర్చించినట్లు సమాచారం.

# ఆర్టిఫిసియల్ రంగానికి కేంద్రం ప్రోత్సాహం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పియూష్ గోయల్‌ను సన్మానించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాపక్షం / హైదరాబాద్ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్రహిస్తుందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. స్టార్టప్ కల్చర్ మన దేశ ప్రగతిలో ఇప్పటికే కొత్త అధ్యాయం లిఖించిందని ఆయన వెల్లడించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యక్రమంలో భాగంగా అనేక ఆర్ అండ్ డి సంస్థలకు గ్రాంట్లు లభించాయని కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన వాణిజ్య వ్యాపార వేత్తల ఆత్మీయ సదస్సు కు మరో కేంద్ర మంత్రి పీయుష్ గోయల్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వానికి, పారిశ్రామికవేత్తలకు మధ్య నిర్మాణాత్మకమైన చర్చకు ఈ వేదిక చాలా కీలకమైందని కిషన్ రెడ్డి అన్నారు. ఇలాంటి నిర్మాణాత్మక చర్చల ద్వారానే అందరి భాగస్వామ్యంతో దేశ భవిష్యత్తుకు బాటలు పడతాయన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపే క్రమంలో మనకు ఎదురయ్యే సవాళ్ల గురించి భారతీయ కార్పొరేట్ కంపెనీలతో చర్చించేందుకు, వినూత్న ఆలోచనలు పంచుకోవడానికి, శక్తివంతమైన భాగస్వామ్యాలను నిర్మించడానికి ఇది మంచి వేదిక అవుతుందన్నారు. పరిశోధన, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అభివృద్ధికి మన హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉందన్నారు. ఈ విషయం చాలా సార్లు నిరూపితమైంది కూడానని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ లో తయారైన వ్యాక్సిన్ యావత్ ప్రపంచంలో కరోనా భయాన్ని తొలగించిందన్నారు. మన దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్ గా తీర్చిదిద్దడానికి మన స్టార్టప్‌లు సాంకేతికంగా అద్భుతమైన పురోభివృద్ధిని సాధించాయన్నారు. ప్రైవేట్ రంగం భాగస్వామ్యం, సాంకేతిక పురోగతి ద్వారా సుస్థిరమైన ఆర్థిక ప్రగతిని సాధ్యమవుతుందని కిషన్ రెడ్డి అన్నారు. జిఎస్‌టి బ్యాంకింగ్ సంస్కరణలు, డిజిటైజేషన్ ను పరుగులు పెట్టించడం వంటి సంస్కరణలు దేశాన్ని వేగంగా ముందుకు నడిపించాయన్నారు. గౌరవ ప్రధానమంత్రి గారి మార్గదర్శనంలో, 2030 నాటికి 100 మిలియన్ టన్నుల కోల్ గ్యాసిఫికేషన్ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నాం. ఈ విషయంలో ప్రైవేటు రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను సన్మానించారు.

# తెలంగాణ వాదనను పట్టించుకోరా?

(మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టు అథారిటీ ముఖ్యులు, కేంద్ర జలసంఘం నిపుణులు, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు, వ్యాప్కోస్, బావర్, కెల్లర్, మేఘా కంపెనీ ప్రతినిధులు, అంతర్జాతీయ డిజైన్ సంస్థ అఫ్రి ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. ఆ తర్వాత నైపుణ్య ఏజెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ నిపుణుల బృందం చర్చించనున్నారు.

**తెలంగాణ వాదనల నేపథ్యంలోనే..**

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌పై తెలంగాణ చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టులో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నట్లు ఏపి ప్రభుత్వం భావిస్తోంది. ఈ సవాళ్లను పరిష్కరించుకుంటూనే ఏపి ముందుకు వెళ్లాలని భావిస్తోంది. ఇందులో భాగంగా డిజైన్లను రూపొందించేందుకు అంతర్జాతీయ డిజైన్ ఏజెన్సీ అఫ్రి సాయం తీసుకుంటున్నారు. వీరికి తోడు అమెరికాకు చెందిన డేవిడ్ బి పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, సీన్ హించ్‌బెర్గర్, కెనడాకు చెందిన రిచర్డ్ డోన్నెల్లీలు నియమితులయ్యారు. పోలవరం ప్రాజెక్టులో సవాళ్లకు సంబంధించిన కీలక అంశాల్లో వీరంతానిపుణులు కావడం విశేషం. అంతర్జాతీయ డ్యాం భద్రత నైపుణ్యం, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, స్ట్రక్చరల్ సొల్యూషన్స్, సివిల్ ఇంజినీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, జియోటెక్నికల్ ఇంజినీరింగ్ వంటి అంశాల్లో వీరికి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం ఉండటంతో వీరిని ఎంచుకున్నట్లు కేంద్ర జలసంఘం పేర్కొంటోంది.

**ఎగువ కాఫర్ డ్యాం సందర్శనతో పర్యటన మొదలు :** తొలుత నిపుణులు కొద్దిసేపు అధికారులతో మాట్లాడతారు. ఈ తర్వాతే ప్రాజెక్టులోని ఎగువ కాఫర్ డ్యాం సందర్శనతో వీరి పర్యటన ప్రారంభం కానుంది. ఆయా కట్టడాలు, నిర్మాణాలు పరిశీలించే క్రమంలో వాటికి సంబంధించిన డిజైన్లు, నిర్మాణ షెడ్యూల్, అధ్యయనాల నివేదికలు, నిర్మాణ క్రమం సందర్భంగా తీసిన ఫోటోలు వారికి అందించేందుకు పోలవరం అధికారులు తగు ఏర్పాట్లను చేశారు. ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణ క్రమంపై ఫొటోలతో రిపోర్టును సమర్పించనున్నారు.

# డిఎస్‌కు కన్నీటి వీడ్కోలు

## ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

## శ్రీనివాస్ మృతదేహానికి సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : మాజీ మంత్రి డి.శ్రీనివాస్ అంత్యక్రియలు నిజామాబాద్ బైపాస్ రోడ్డు సమీపంలోని ఫామ్‌హౌస్‌లో ఘనంగా జరిగాయి. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. అంతకు ముందు నిజామాబాద్‌లోని ప్రగతినగర్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు డీఎస్ నివాసం నుంచి ప్రారంభమైన అంతిమ యాత్ర, కంఠేశ్వర్, బైపాస్ రోడ్డు మీదుగా ఆయన వ్యవసాయ క్షేత్రం వరకు సాగింది. అక్కడ అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లను ముందే చేసి ఉంచారు. ఈ అంతిమ యాత్రలో రాజకీయ పార్టీల నేతలు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. అంతకు ముందు నిజామాబాద్‌లోని నివాసంలో శ్రీనివాస్ పార్థివ దేహానికి సిఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం డిఎస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిసిసి చీఫ్‌గా, మంత్రిగా డిఎస్ సేవలు అందించారని తెలిపారు. నిజామాబాద్ నుంచి బలహీన వర్గాల వారికి అవకాశం కల్పించింది డిఎస్సే అని కొనియాడారు. కుటుంబ సభ్యుల ఆలోచనలతోనే డీఎస్‌ను గుర్తుపెట్టుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని సోనియా గాంధీతో వివరించటంతో ఆనాడు కరీంనగర్ సభలో 2004లో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆమోదించి నాలుగు కోట్ల ప్రజలకు మాటివ్వటం జరిగిందన్నారు. పిసిసి అధ్యక్షునిగా 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి డిఎస్ ఎంతో కృషి చేశారని,



2009లోనూ డిఎస్ సారథ్యంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందన్నారు. విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొంతకాలం పార్టీకి దూరమైనా పార్లమెంటులో సిఎస్‌ను సోనియాగాంధీ ఆప్యాయంగా పలకరించేవారని తెలిపారు. డీఎస్ చనిపోయినప్పుడు కాంగ్రెస్ జెండా తనపై కప్పాలనే ఆయన కోరికను నెరవేర్చడానికే కాంగ్రెస్ జెండాను ఆయనపై కప్పామని తెలిపారు. ఇలా ఆయన చివరి కోరికను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసానికి పంపించి నెరవేర్చామన్నారు. డిఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అండగా నిలబడుతుందని, వారి పిల్లలతో నాకు సాన్నిహిత్యం ఉందని, ఆయన మీద ఉన్న గౌరవం, ఎనలేని సేవలను గుర్తించి ఇక్కడికి వచ్చి నివాళులర్పించటం జరిగిందని వారి కుటుంబ సభ్యులతో చర్చించి ఈ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత డిఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. డి.శ్రీనివాస్ కుటుంబం కాంగ్రెస్ కుటుంబమని ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. సిఎం వెంట సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, నరాల రత్నాకర్, కేశ వేణు నాయకులున్నారు.

## సింగరేణి సిఎండి బలరామ్‌కు ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సింగరేణి సంస్థను పర్యావరణ హిత సంస్థగా మార్చడమే కాకుండా అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు కృషి చేసిన సింగరేణి సంస్థ సిఎండి ఎన్.బలరామ్ కు గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ వారు 'ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ' అనే ప్రతిష్ఠాత్మక అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ 2024అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండి అశుతోష్ వర్మ, ఎన్‌టిపిసి, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉన్నతాధికారులు ఎన్.బలరామ్‌కు ఈ అవార్డును అందజేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వరంగ, ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు గ్రీన్ మ్యాపుల్ వారు ప్రతి ఏడాది ఇటువంటి ప్రోత్సాహక అవార్డులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎన్.బలరామ్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న తమ సంస్థ నిబంధనల ప్రకారం పచ్చదనాన్ని కాపాడడంతో పాటు స్వచ్ఛందంగా కూడా పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని సింగరేణి వ్యాప్తంగా 6 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు చెప్పారు. సింగరేణి సంస్థ చేస్తున్న పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా 2021–22వ సంవత్సరంలో కార్బన్ న్యూట్రాలిటీ కంపెనీగా సిఎంపిడిఐ గుర్తించిందని పేర్కొన్నారు. ప్రతీ అడుగు పచ్చదనం అన్న నినాదంతో సింగరేణిలో మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సింగరేణివ్యాప్తంగా ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో మరో 2 వేల మొక్కలు నాటాలని వ్యక్తిగత లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. దీంతో 20 వేల మొక్కలు నాటినట్లు అవుతుందన్నారు. కంపెనీలో ఈ ఏడాది 40 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. తనకు అవార్డును ప్రకటించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపిన ఆయన ఈ అవార్డు సింగరేణిలోని పర్యావరణహితులందరికీ చెందుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పర్యావరణహిత కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

## ఎస్‌టి, ఎస్‌సి, బిసి అభ్యర్థులకు ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ

### 7వ తేదీలోపు దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు – 2025 కోసం తెలంగాణ రాష్ట్ర ఎస్‌టి, ఎస్‌సి, బిసి అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఎస్‌ఎస్ స్టడీ సర్కిల్‌లో ద్వారా రెసిడెన్సీయల్ విధానంలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనుంది. అర్హులైన తెలంగాణ రాష్ట్ర ఎస్‌టి, ఎస్‌సి, బిసి అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు తెలిపారు. అభ్యర్థులు అబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలలోపు ఉండాలన్నారు. అభ్యర్థులు http://studycircle.cgg.gov.in లో లాగిన్ అయ్యి ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, సూచనల కోసం http://studycircle.cgg.gov.in, http:// twd.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 6281766534 లో సంప్రదించాలని సూచించారు.

## విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

### మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యుత్ బిల్లుల వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుల వసూలును ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని, పైలెట్ ప్రాజెక్టుగా పాతబస్తీని ఎంచుకున్నారని, ఇది కేవలం పాతబస్తీకి పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆరోపించారు. ప్రైవేటుపరం చేస్తే విద్యుత్ సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు ఇక రాష్ట్రంలో ఉండబోవన్నారు. విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడతారని, గతంలో కెసిఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చినా విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించలేదని, ఇందుకు కెసిఆర్ ప్రభుత్వం అంగీకరించ లేదన్నారు. మోదీ కనుసన్నల్లో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, మోదీ, అదానీ విధానాలను తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్‌ను ప్రైవేటుపరం చేస్తే విద్యుత్ ఉద్యోగుల పాత్ర నామమాత్రంగా మారే అవకాశం ఉన్నదన్నారు. 200ల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందని, పాతబస్తీలో 200 యూనిట్ల లోపు కరెంటు బిల్లు వచ్చే కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. విద్యుత్ సంస్థ అనేది ప్రజల ఆస్తి అని, దీనిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారన్నారు. పాతబస్తీలో 45 శాతం మాత్రమే కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయని, అందుకే ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నామని రేవంత్ రెడ్డి చెబుతున్నారని, రాష్ట్రంలో 95 నుండి 97 శాతం వరకు కరెంటు బిల్లులు వసూలవుతున్నాయని జగదీష్ రెడ్డి వివరించారు. సింగరేణి బొగ్గు గనులను వేలంపాటలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారని, శ్రావనపల్లి బొగ్గు గనిని వేలం నుండి ఎందుకు తీసివేయించలేదని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తాము ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదని ఆయన తెలిపారు.

## కొత్త చట్టాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం:వినోద్ కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్:క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ చట్టాలను రద్దుచేసి, కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతంగా మారాయని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. కొత్త చట్టాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసినట్టు వివరించారు. కొత్త చట్టాలపైన రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు స్పందించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ న్యాయ వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కొత్త చట్టాలపై విస్తృతంగా పరిశీలించి, చేసిన అనేక సూచనలను కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. దాదాపు 160 మంది పార్లమెంట్ సభ్యులను బయటకు పంపి, ఈ బిల్లును కేంద్రం ఆమోదించుకున్నదని వినోద్ కుమార్ గుర్తుచేశారు. దేశ వ్యాప్తంగా సీనియర్ న్యాయవాదులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్నారన్నారు. కొత్త చట్టాలను రద్దు చేయాలని కేంద్ర హోం, న్యాయ శాఖ మంత్రులకు లేఖ రాసినట్టు వివరించారు. కొత్త చట్టాల పేర్లు దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాల మార్పులను వాయిదా వేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. చేతికి బేడీలు వేయవద్దని సుప్రీం కోర్టు చెబుతుంటే, ప్రస్తుత కొత్త చట్టంలో చేతికి బేడీలు వేయాలని ఉన్నదని, 14 రోజుల పోలీస్ కస్టడీకి బదులుగా 90 రోజుల వరకు అవకాశం కల్పించారని, కొత్త చట్టాలతో బాధితులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బార్ కౌన్సిల్‌ను కూడా ప్రధాని మోదీ మోసం చేశారని, కొత్త చట్టాలపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంటుందన్నారు. బిఆర్‌ఎస్ నాయకుడు సోమ భరత్ కుమార్ మాట్లాడుతూ కొత్త చట్టాలతో దేశ న్యాయ వ్యవస్థకు ఆటంకం కలుగుతుందన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు న్యాయ వ్యవస్థ కీలకం గా ఉంటుందన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాసేలా కొత్త చట్టాలను చేశారని మండిపడ్డారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస యాదవ్, లలిత రెడ్డి పాల్గొన్నారు.

## జల సంరక్షణతోనే...మానవాళి మనుగడ సాధ్యం

- డాక్టర్స్ డే సందర్భంగా ఇగ్నైటింగ్ మైండ్స్, వాక్ ఫర్ వాటర్ ఆధ్వర్యంలో 5కె వాక్
- పాల్గొన్న డిఆర్‌డిఒ మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, సింగరేణి సిఎండి బలరామ్ ప్రభృతులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : జల సంరక్షణకు, భూగర్భ జలాల పెంపుదలకు, వాననీటి సద్వినియోగానికి ప్రజలందరూ తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నీటి సంరక్షణను ఒక ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని డిఆర్‌డిఒ మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి అన్నారు. వాననీటి సంరక్షణ చేయకపోతే మానవాళి మనుగడ ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు.

జులై 1వ తేదీన వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ దుర్గం చెరువు పార్కులో ఇగ్నైటింగ్ మైండ్స్, వాక్ ఫర్ వాటర్, సింగరేణి సంస్థల ఆధ్వర్యంలో జల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు 5కిలోమీటర్ల నడక ( 5 కె వాక్ ) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వాక్ ఫర్ వాటర్ వ్యవస్థాపకులు కరుణాకర్ రెడ్డి నిర్వహణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీటిని కాపాడుకోవడాన్ని ప్రతీ ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఖాదీ బోర్డు సభ్యులు పేరాల శేఖర్ రావు మాట్లాడుతూ.. జల కాలుష్యాన్ని నివారించాలని, నదులు లేకపోతే నాగరికత ఉండదన్నారు. ప్రజలు ఇతర సమస్యల కన్నా పర్యావరణ సమస్యలను అత్యంత ప్రాధాన్యత గల అంశాలు గా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. జల సంరక్షణతోపాటు మొక్కలు నాటడానికి ప్రతీ ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంవల్ల అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం చేస్తే తాగునీటికి కూడా యుద్ధాలు చేసుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యం కోసం వైద్యుల అవసరం ఉంటుందని.. కానీ ప్రపంచం మనుగడకు ప్రకృతిని కాపాడుకోవడం ద్వారానే సాధ్యమని.. ఇందుకోసం నీటి సంరక్షణ అత్యంత అవసరమన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని కూడా తగ్గించాలని పిలుపునిచ్చారు. అనంతరం 200మందికి పైగా వైద్యులు ఉత్సాహంగా 5 కిలోమీటర్లు నడిచారు. ఈ 5కె వాక్‌లో పాల్గొన్న వారిని డాక్టర్ సతీష్ రెడ్డి నిర్వాహకులు మెడల్స్‌తో సత్కరించారు.

## నిరుద్యోగుల తరఫున అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

### మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: నిరుద్యోగుల తరఫున రానున్న శాసనసభ సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, సభను స్తంభింపచేస్తామని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగులకు బిఆర్‌ఎస్ పూర్తి అండగా ఉంటుందన్నారు. గ్రూప్స్, నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ నాయక్‌ను హరీశ్ రావు ఆదివారం పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి స్వయంగా వచ్చి మోతిలాల్ నాయక్‌తో మాట్లాడి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వరకు నిరుద్యోగుల తరఫున బిఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. దీక్ష విరమించి, కలిసి పోరాటం చేయాలని ఆయన మోతీలాల్‌నాయక్‌ను కోరారు.



మోతీలాల్ ఆరోగ్యం పట్ల ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని అన్నారు. కోదండరాం నిరుద్యోగుల హక్కుల పట్ల పూర్తి బాధ్యత తీసుకోవాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ లను అమలు జరిగేలా ముందుకు రావాలని సూచించారు. నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరామ్, రియాజ్, బాల్మూరి వెంకట్, ఆకునూరి మురళి,రేవంత్‌రెడ్డి అశోక్ నగర్‌లోని కోచింగ్ సెంటర్ల చుట్టు తిరిగారని, అక్కడికి రాహుల్ గాంధీ ని కూడా తీసుకొచ్చారని హరీశ్‌రావు తెలిపారు. ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, తన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని, ఆరునెలలు గడిచినప్పటికీ జాబ్ క్యాలండర్‌ను విడుదల చేయలేదని ఆరోపించారు.




## బానిసత్వపు చట్టాలను మార్చుకోవాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : బానిసత్వపు ఆలోచనలు, బానిసత్వపు చట్టాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం నారాయణగూడలోని కేశవ స్మారక ఆడిటోరియంలో జరిగిన కొత్త చెట్టాలపై చర్చగోష్టి కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక దేశాలలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయా దేశాలకు సంబంధించిన అనేక విషయాల్లో మార్పులు వచ్చాయని, ఈ క్రమంలోనే ఐపిసి, సిఆర్‌పిసి చట్టాలను కూడా మార్చామని తెలిపారు. తాను హోంశాఖ సహాయమంత్రిగా ఉన్న సమయంలోనే తన వద్దకు న్యాయవాదులు వచ్చి చట్టాలను మార్చాలన్న అంశాలపై చర్చించారని, వాటిని తాను అమిత్‌షా, నరేంద్రమోదీల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఈ చట్టాల మార్పుకు అంకురార్పణ ఏర్పడిందన్నారు. మనం ఇంకా బ్రిటిష్ చట్టాలనే అనుసరిస్తున్నాం.. ఇంకా వారి చట్టాలనే ఎందుకు కొనసాగించాలి మనకు స్వయంగా చట్టాలను తయారుచేసుకునే ఆలోచన, శక్తి లేదా? అని అన్నారు. 75 సంవత్సరాల తరువాత కూడా ఇంకా బానిసత్వపు ఆలోచనతోనే మనదేశం కొనసాగాలా? అని అన్నారు. ప్రధాని మోదీ ఖచ్చితంగా దేశానికి మంచి పనిచేస్తారు. గుడ్డిగా కావాలని కొన్ని వ్యతిరేకించే శక్తు లు, సంస్థలు, ఈ దేశంలో ఉన్నా యి..అందుకే మనం వెనకబడే ఉన్నామన్నారు.

## కస్టమ్స్ అధికారులపై సిబిఐ కేసు

### శంషాబాద్ విమానాశ్రయంలో సోదాలు

### విదేశీ కరెన్సీ విషయంలో అవినీతికి పాల్పడిన వైనం

ప్రజాపక్షం/హైదరాబాద్: అవినీతికి పాల్పడిన ముగ్గురు కస్టమ్స్ అధికారులపై సిబిఐ కేసు నమోదు చేసింది.ఈ మేరకు ఆదివారం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీ య విమానాశ్రయంలోని కస్టమ్స్ కార్యాలయంతో పాటు హైదరాబాద్‌లోని ముగ్గురు అధికారుల ఇళ్లలో కూడా సిబిఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక పత్రాలు, నగదు స్వాధనం చేసుకున్నారు. ఈ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులుగా పనిచేస్తున్న నిజాంపేట్‌కు చెందిన ఎరుకల శ్రీనివాసులు, బోయిన్‌పల్లికి చెందిన పంకజ్ గౌతమ్, సికింద్రాబాద్‌కు చెందిన పెరి చక్రపాణిలపై కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురు అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ డ్యూటీ చెల్లించకుండానే కొన్ని కంపెనీలు, వ్యక్తులకు సంబంధించి ఫారెన్ కరెన్సీని ఎక్స్ఛేంజ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

కొన్ని కంపెనీలు, వ్యక్తులతో ఈ ముగ్గురు అధికారులు కుమ్మక్కై విదేశీ, ఇండియా కరెన్సీకి సంబంధించిన వాటిలో అక్రమాలకు పాల్పడి నిందితులకు లబ్ధిచేకూర్చారు. ఉద్దేశ్యపూర్వకంగా నేరానికి పాల్పడిన ఈ ముగ్గురు అధికారులపై కేసు నమోదుచేసిన సిబిఐ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఈ ముగ్గురు అధికారులు విమానాశ్రయంలో నమోదు చేసిన కస్టమ్స్ కేసులను కూడా తిరిగి పరిశీలిస్తున్నారు.

## నేటి నుండి పాఠశాల విద్యార్థులకు పూర్తిస్థాయి డిజిటల్ పాఠాలు

- ఉదయం 10 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు
- ఏడు సబ్జెక్టులు అరగంట నిడివిగల పాఠ్యాంశాలు



### సిఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయి డిజిటల్ పాఠాలు అందించేందుకు టిసాట్ నెట్‌వర్క్ ప్రణాళిక సిద్ధం చేసింది. జూలై 1వ తేదీ నుంచి 2024–25 విద్యా సంవత్సరానికి ఒకటి నుండి 10వ తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయి పాఠ్యాంశాలు ప్రసారం చేసేందుకు షెడ్యూల్ ఖరారైంది. విద్యా శాఖ క్యాలండర్ ను అనుసరించి టిసాట్ సిఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రసారాలకు సంబందించి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత పదిహేను రోజులుగా బ్రిడ్జ్ కోర్స్ పాఠ్యాంశాలు ప్రసారం చేసిన టిసాట్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 223 పాఠశాలల పని రోజుల్లో 749 గంటల కంటెంట్‌ను 1,498 పాఠ్యాంశ భాగాలుగా విద్యా ఛానల్‌లో ప్రసారం చేస్తున్నట్లు సిఈఓ వివరించారు. ప్రాథమిక విద్యకు సంబందించి తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్ పాఠ్యాంశాల ప్రసారాలుంటాయని వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పాఠశాలల పని రోజుల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు టిసాట్ విద్య ఛానల్‌లో విద్యార్థులకు అనుగుణంగా పాఠ్యాంశ ప్రసారాలుంటాయని, పాఠశాలల్లో ప్రత్యక్షంగా పాఠాలు వినలేని విద్యార్థులు ఆన్‌లైన్ పాఠాలు వినేందుకు చక్కటి అవకాశం కల్పించామని సిఈఓ తెలిపారు. పాఠ్యాంశాలు తెలుగు, ఇంగ్లీష్ తో పాటు ఉర్దూ భాషలోనూ అందుబాటులో ఉన్నాయని, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సుమారు 29,478ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపు 58,98, 685 మంది విద్యార్థులు ఈ డిజిటల్ పాఠాలను సద్వినియోగం చేసుకోవాలని సిఈఓ వేణుగోపాల్ రెడ్డి సూచించారు. పాఠ్యాంశాల కంటెంట్ టిసాట్ శాటిలైట్ ఛానల్ విద్యతో పాటు టిసాట్ యాప్, యూట్యూబ్ లోనూ అందుబాటులో ఉంటాయన్నారు.




## ప్రజాహితం కోసం పనిచేస్తున్న బోట్ క్లబ్

### ది హైదరాబాద్ బోట్ క్లబ్ అధ్యక్షుడు చెన్నాడి సుధాకర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో ది హైదరాబాద్ బోట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాహితం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని మాజీ ఎంఎల్‌సి, క్లబ్ అధ్యక్షులు చెన్నాడి సుధాకర్ రావు తెలిపారు. ది హైదరాబాద్ బోట్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొత్త కమిటీ సభ్యులతో కలిసి సుధాకర్ రావు మాట్లాడారు. ప్రత్యేకంగా విద్య, వైద్య రంగాలపై ప్రజలను చైతన్యవంతులు చేయడంతో పాటు మురికివాడల్లో క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులో నిర్వహించడం చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా కొన్ని అభివృద్ధికి నోచుకొని ప్రాంతాలను, కాలనీలను ఎంపిక చేసి ఆ ప్రాంతాల అభివృద్ధి కోసం భవిష్యత్తులో పనిచేస్తామని ప్రకటించారు. కరోనా, తుఫాన్ సమయంలో రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షల రూపాయల సహాయాన్ని క్లబ్ తరఫున అందించామన్నారు. క్లబ్ సభ్యుల కోసం హెల్త్ క్యాంపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్ మెంబర్స్ కోసం ఇతర రాష్ట్రాల క్లబ్బులతో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. తద్వారా బోట్ క్లబ్ సభ్యులు ప్రస్తుతం అనుసంధానమైన వివిధ రాష్ట్రాల్లోని 59 ఆయా క్లబ్‌లలో కూడా సౌకర్యాలను పొందవచ్చని తెలిపారు. 2024 26 సంవత్సరానికిగాను ఎన్నికైన కొత్త కమిటీని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. 8వసారి ప్రెసిడెంట్‌గా చెన్నాడి సుధాకర్ రావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ. మురళీధర్ రెడ్డి, సెక్రటరీగా 8వ సారి టి. అమరేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా బి. నరేందర్ రావు, కోశాధికారిగా కె. ధరణిధర్, బోట్ క్లబ్ మీటింగ్ కమిటీ మెంబర్స్‌గా హెచ్.వి. సురేందర్ నాథ్, సోమ విజయ్ ప్రకాష్, శేషగిరిరావు తుమ్మల, టి. శ్రీధర్ రెడ్డి, వి. సుధీర్ రెడ్డి, వి. విజయ్ గోపాల్ రావులు ఎన్నికైనట్లు ప్రకటించారు.

## వికలాంగుల సమస్యలు పరిష్కరించరూ...

### అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు



ప్రజాపక్షం / హైదరాబాద్: వికలాంగులు సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను కోరారు. హైదరాబాదులో ఆదివారం ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ సిపి రాధాకృష్ణను అఖిలభారత వికలాంగుల వేదిక జాతీయ దీక్ష కొల్లి నాగేశ్వరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. వికలాంగుల పెన్షన్ పెంపు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, ప్రతి ఒక్క వికలాంగుడికి డబల్ బెడ్ రూమ్‌ల కేటాయింపు, అర్హులైన వికలాంగులందరికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన గవర్నర్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఆసరా పెన్షన్ పెంచకపోవడం దురదృష్టకరమని, ఎంతోమంది దివ్యాంగులు, వృద్ధులు తదితరులు ఆసరా పెన్షన్‌కోసం ఎదురుచూస్తున్నారని ఆయన గవర్నర్‌కు వివరించారు. ప్రభుత్వం అధికారులతో చర్చించి వికలాంగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు నాగేశ్వరరావు తెలిపారు.

## రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాబోయే నాలుగురోజులు పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలుచోట్ల బలమైన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. మరికొన్ని చోట్ల ఉపరితల గాలులు వీస్తాయని హెచ్చరించారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని చెప్పారు. ఆదివారం నుంచి బుధవారం వరకు బలమైన, స్థిరమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన ఆవర్తనం ప్రభావంతో ఉత్తర ఒడిశా తీరానికి దగ్గరలో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అధికారులు తెలిపారు. రాబోయే రెండురోజుల్లో వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందన్నారు. ఆదివారం నుంచి సోమవారం వరకు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, వరంగల్‌లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పలుచోట్ల బలమైన ఉపరితల గాలులు వీస్తాయని తెలిపారు. జూలై 2 వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని హెచ్చరించారు. గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కొత్తగూడెం, హన్మకొండ, ములుగు, వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, మహబూబ్ నగర్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయని చెప్పారు. కొత్తగూడెం జిల్లా ములకలపల్లిలో అత్యధికంగా 87 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైందని తెలిపారు.

# సాహితీ విహారి

# బడుగు ప్రజల గొంతుకైన 'కవిరేడు' చెరబండరాజు

అణచివేత గుండె మంట రగిలిరగిలి అక్షర దావాలనమై ఎగ సిపడితే 'చెరబండరాజు' గీతాల రూపాన్ని సంతరించుకుంటుంది. దిగంబర కవుల్లో ఒకడైన చెరబండరాజు (బద్దం భాస్కర్‌రెడ్డి) కష్టాల కడలి కడుపు మీటి, తిరుగుబాటు కెరటాలపై లేచినవాడు. ప్రజలను మేల్కొల్పిన వాడు. ప్రజల గొంతుకైనవాడు. మాన వ హక్కుల కోసం నినదించిన వాడు. సమసమాజం కోసం పరితపించిన వాడు. అక్షరాలే ఆయుధాలుగా మలచుకున్నవాడు. ధిక్కారమే ఊపిరిగా చేసుకున్నవాడు. కవితలతో విప్లవాల నెగడు సృష్టించిన 'కవిరేడు' చెరబండరాజును ఒక వ్యక్తిగా చూడడానికి వీల్లేదు. అతనొక శక్తి. తాడిత, పీడిత, పేదల ప్రతినిధి. అతని ప్రతి మాటా ఓ నిప్పు కణిక. అతని ప్రతి గీతం అణగారిన వర్గాల ఆశాదీపం. 38 ఏళ్లకే ఏదో పనివున్నట్టు హడావుడిగా వెళ్లినప్పటికీ, కొన్ని తరాలకు సరిపడా స్ఫూర్తిని అందించాడు. 'విప్లవాల యుగం మనది... విప్లవిస్తే జయం మనదె' అంటూ కోట్లాది మందికి మార్గదర్శకం చేశాడు. 'కష్టజీవులను కనలికనలి చావద్దని' కోరాడు. సైనికులై కదలిరావాలని పిలుపునిచ్చాడు. 'పోలీసుల రజ్యాంలో పౌర హక్కులు అడుగంటాయని విమర్శించాడు. కోర్టుల్లో జనన్యాయాన్ని గొంతునులిమి చంపుతున్నారంటూ నిర్భీతిగా ప్రకటించడం చెరబండరాజుకు మాత్రమే సాధ్యం. 'చెరసాలలు ఉరికొయ్యలు వెలుగును బంధించలేవు' అని తేల్చిచెప్పాడు. 'శ్రమజీవుల శక్తి ముందు ఏ శక్తులు నిలువగలవు'అని ప్రశ్నిస్తూ, ప్రతి బాధిత గుండెనూ జాగృతం చేశాడు. 'ఊపిరి' కవితలో ఎరుపు గురించి అద్భుతంగా వివరించాడు. 'కష్టజీవుల నెత్తురెరుపూ..

కమ్యూనిస్టు జెండ ఎరుపూ... దోపిడీ లేనట్టి బతుకులకెవడు ఆయుధమెత్తినాడో వాడి మాటలు ఎరుపు ఎరుపూ.. వాడి చేతలు ఎరుపు ఎరుపూ' అంటూ కవిత సాగుతుంది. 'గుండె చదరవద్దని.. గుండ్లకు అదరవద్దని' కోరుతూ, 'రండి సోదరులార రండి.. ఎర్రజండా విడువకండి' అని పిలుపునిచ్చాడు చెరబండరాజు. ఇక 'కొండలు పగలేసినం' అనే గీతం లక్షలాది మందిని ఉర్రూతలూగించింది. ఆలోచింప చేసింది. కష్టం ఎవరిది? అనుభవిస్తున్నది ఎవరు? అని ఆయన నిలదీసిన వైనం అద్భుతం. అనన్యసామాన్యం.

'కొండలు పగిలేసినం, బండలనూ పిండినం
మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు గట్టినం
శ్రమ ఎవడిదిరో, సిరి ఎవడిదిరో' అని నిలదీశాడు. శ్రమ దోపిడీని ఎదిరించాడు. ఎవరి భుజాల మీద ఎవరెక్కి కూర్చున్నారో మన కళ్లకు కట్టాడు.

'బంజర్లను నరికినం, పొలాలనూ దున్నినం
మా చెమటలు ఏరులుగా పంటలు పండించినం
గింజెవడిదిరో, గంజెవడిదిరో' అని రైతన్న ఆవేదనను అర్థవంతంగా ఆవిష్కరించాడు. ఈ గీతం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎన్ని విశేషణాలు జోడించినా కరువే.

'మగ్గాలను పెట్టినం, పోగు పోగు వడికినం
మా నరాలె దారాలుగ గుడ్డలెన్నొ నేసినం
ఉడుకెవడిదిరో, వణుకెవడిదిరో'అని నేతన్నల ఆవేదనను వర్ణించినా,

'యంత్రాలను తిప్పినం, ఉత్పత్తులు పెంచినం
మా శక్తే విద్యుత్తుగ ఫ్యాక్టరీలు నడిపినం
మేడెవడిదిరో గుడిసెవడిదిరో' అంటూ శ్రామికుల కష్టాన్ని కళ్లకు కట్టినా, అది చెరబండరాజు కలమే అవుతుంది. అందుకే ఆయన మాటలు నినాదాలయ్యాయి. కవితలు నిత్యస్మరణీయాలయ్యాయి. నిజానికి చెరబండరాజు గురించి కొత్తగా చెప్పడానికి ఏముంది? ఏ కష్టజీవి చెమటచుక్కను తట్టినా తెలుస్తుంది. ఏ రైతన్న నాగలిని కదిలించినా చెప్తుంది. ఏ మగ్గం దారపుపోగును స్పృశించినా వివరి



స్తుంది. ఎర్ర జెండా.. కమిలిన గుండె.. ఎక్కడ చూసినా చెరబండరాజు కనిపిస్తాడు.

చెరబండరాజు అనగానే ఓ విప్లవ కవి గుర్తుకొస్తాడు. అతని ఆలోచనలే అక్ష రూపం దాల్చాయి. అక్షరబద్ధమైన ప్రతి ఆలోచనా ఆచరణీయమైంది. అతను ఓ కవి. ఓ నవలాకారుడు, ఓ పాటల రచయిత. హైదరాబాద్‌కు కేవలం14కిలోమీటర్ల దూరంలోని అంకుశాపూర్‌లో, 1944లో జన్మించిన చెరబండరాజును మృత్యువు మెదడు క్యాన్సర్ రూపంలో వెంటాడింది. 1982 జులై 2న మన నుంచి దూరం చేసింది. మహాకవి శ్రీశ్రీ తన 'మరోప్రస్థానం' కావ్యాన్ని చెరబండరాజుకు అంకితమిచ్చాడంటే, శ్రమజీవుల కవిగా అతని విలువ ఏమిటో అర్థమవుతుంది. హైదరాబాద్‌లోని మలక్‌పేట గవర్నమెంట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దాడు. కవిగా జనహృదయాలను కొల్లగొట్టాడు. 'నన్నెక్కనివ్వండి బోను' అంటూ తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. విప్లవాన్ని ఊపిరిగా చేసుకున్నాడు కాబట్టే, 1971–1977 మధ్యకాలంలో, వివిధ సందర్భాల్లో మొత్తం మూడేళ్ల జైలు జీవితం అనుభవించాడు. ఫలితంగా అనారోగ్యంపాలయ్యాడు. మూడుసార్లు శస్త్రచికిత్స చేయక తప్పలేదు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడే, ప్రభుత్వం అతనిని ఉద్యోగం నుంచి తొలగించింది. ఈ ఘటనతో తెలంగాణ వ్యాప్తంగా నిరసలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఒక కవి కోసం కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఆందోళనలు జరపడం బహుశా అంతకు ముందుగానీ, ఆ తర్వాతగానీ ఎన్నడూ జరగకపోవచ్చు. గత్యంతరం లేని స్థితిలో ప్రభుత్వం ఆయనను మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోకతప్పలేదు. అన్యాయాలను, అక్రమాలను, దోపిడీని, దుర్మార్గాన్ని ఏమాత్రం ఉపేక్షించని చెరబండరాజు చివరి శ్వాస వరకూ పోరుబాట వీడలేదు.

'అనారోగ్య బాధితుణ్నే
అయితేనేం యోధుణ్నే
పోరాటం డైరెక్షన్
పాట నాకు అక్సిజన్' అనగలిగే గుండె దిటవు ఎవరికి ఉం టుంది? అందుకేనేమో, కవిత్వం ఆయన చెంతచేరి మురిసిపోయిం ది. పాట ఆయన కలం నుంచి జాలువారి సార్థకతను పొందింది. మె దడును తొలుచుతిన్న కేన్సర్ కూడా చెరబండరాజు ఆలోచనలకు అడ్డుకట్టవే



యలేకపోయింది. మనిషిని మన నుంచి దూరం చేయగలిగిందే తప్ప, ఆ యన వేసిన స్ఫూర్తి బాటను చెరపలేకపోయింది. 'ప్రజాపోరాటాల విజయాలను రచించకపోయిన రోజే తన మృత్యువడం చెరబండరాజు నిబద్ధతకు నిలువుటద్దం. పాలకుల దమననీతిని ప్రశ్నించినందు కు లాఠీదెబ్బ తిని... జైళ్లలో మగ్గుతున్నఖైదీలపై 'వెయ్యి పూల' జల్లు లు కురిపించాడు. 'ఉదయాస్తమయాలలో ఖైదీల కన్నీటితో పూసిన ఎర్రగన్నేరుపూలు నిర్మలంగా మెరుస్తున్నాయి' అంటూ, వాటి ని తెంచవద్దని కోరతాడు. 'ఎందరు నిరపరాధుల జీవితాలు ఈ బందిఖానాలో సమాధి చేయబడ్డాయో'అనివారి నిర్దోషిత్వాన్ని, పాలక వర్గాల అణచివేత ధోరణిని ప్రశ్నిస్తాడు. అందుకే, 'మల్లెలు పరిమళాల అం జలి ఘటిస్తూ తెల్లగా విచ్చుకుంటున్నాయి. మలిన పరచకండి' అని కోరతాడు. 'సమతాస్వాతంత్ర్యాల కోసం పోరాడిన వీరులు ఎందరిక్కడ నరకబడ్డారో' లెక్క తేల్చాలనిఅంటాడు. 'పిరికితనంతో రాజీపడకండి' అంటూ కర్తవ్యబోధ చేస్తాడు. 'వెయ్యిపూలు వికసించనీండి.. వెయ్యి ఆలోచనల ఘర్షణ పడనీండి' అంటూ ముగిస్తాడు. 'పనిచేయని పైతరగతి పద్మాసనం వేసుక్కూర్చున్న ప్రభు సంతతి అదే పనిగా జనం పేరు జపిస్తోంది' అంటాడు చెరబండరాజు 'చరిత్ర పుష్పం' కవితలో. కుహనా రాజకీయవేత్తల అసలు రంగును బయటపెట్టాడు.

'మంగముళ్ల మార్గాలేవో
మొసళ్ల మోసాలేవో
కనిపెట్టి మసలుకోవడం
కళ్లున్న వాళ్లు చేసే పని' అంటూ సామాన్యుడిని హెచ్చరించాడు.
'ఒక మెట్టు పైనున్న వాళ్లు
ఎక్కిన నిచ్చెన తన్నేసిన వాళ్లు'... ప్రస్తుత సమాజంలో వేళ్లూనుకున్న ఆర్థిక అసమానతలకు కారణం ఏమిటో దశాబ్దాల క్రితమే తెలియచెప్పాడు.తెలంగాణ పట్ల చెరబండరాజుకు అవాజ్యమైన ప్రేమ. తెలంగాణప్రజలు అణచివేతకు,దోపిడికి,హింసకు గురవుతున్న తీరును చూసి ఆయన చెలించిపోయాడు. కమ్యూనిస్టు పోరాటాలను ఎలుగెత్తి చాటాడు.'ఎర్రెర్రని తెలంగాణ' గీతంలో 'ఇదేనండి ఇదేనండి ఎర్రని తెలంగాణకమ్యూనిస్టు గుండెకాయ కష్టజీవి కలలకోన' అంటూ కీర్తించాడు. తెలంగాణ సాయుధ పోరాటంలో 'రైతుకూలి పేదజనం చీమలవలె కదిలొచ్చి లక్షలాది ఎకరాలను హస్తగతం చేసుకొనీమూడువేల గ్రామాలలో ఎర్రజెండ నెగురవేసిన' వైనాన్ని గుర్తుచేశాడు. అంతేకాదు.. సమకాలీన పరిస్థితులను ప్రస్తావిస్తూ,'ఏ ఇంట్లో ఏ బిడ్డడు ఎందుకొరకు చచ్చెనీఅడగండీ ప్రతి పల్లెను ప్రతి చెట్టును ప్రతి గుట్టను ఆత్మకథలు చెప్పునవీ దోపిడింక పోలేదని' అంటాడు. భూమి కోసం..భుక్తి కోసం..విముక్తి కోసంఉద్యమబాట తప్పదని స్పష్టం చేశాడు.

–సత్యశ్రీ

# నేస్తమా తల దించకురా



పల్లవి నేస్తమా తల వంచకురా
వాస్తవాన్ని చేదించుమురా
మిత్రమా తలదించకురా
ఆశయన్ని సాధించుము రా
ముల్లెన్ని దారిలో ఉన్న
కళ్ల నీరు రానివ్వకురా
చరణం జీవితం ఒక ప్రస్తానం
అనుభవాలు మైలరాళ్లురా
అపజయాలు అవలోకించు
విజయాలు ఆహ్వానించు
చరణం ఆర్థికంగా ఎదగాలీ
ఆపదలో ఉన్నవారిని
ఆదుకునే మనసుండాలీ
మన మంచిని మన తర్వాత
జనంగుర్తు చేయాలీ

–డా.ఎస్.సూర్యప్రకాష్

# ఆడపిల్ల అగ్గిపుల్ల



అనంత జీవ సృష్టి సౌధానికి
వెలుగు బిల్ల
కడవరకు తోడై నిలిచే
కమ్మని వరాల ఖిల్లా
అమ్మ అయి ఆలి అయి
జాలి అయి లాలి అయి
కోటి వరాల కొమ్మ అయి
కాచుకునే కల్పతరువు అమ్మ

– గుండెల్లి ఇస్తారి
9849983874

# ఆరుద్ర పురుగులు



మేఘాల దుప్పట్లు ఆరేసిన ఆకసం
ఉరుములు మెరుపుల వర్ష హెచ్చరికలు
చిటపట చినుకుల తొలకరి అక్షింతలు
మట్టి తానమాడి తన్మయత్వ తుళ్లింతలు
ఆరుద్ర పురుగుల అపురూప పరుగులు
తాకిన క్షణమేగా మృదు సిల్క్ స్పర్శలు !
వ్యగ్రహం వదిలిన దీపపు పురుగులు
జ్యోతియే దైవమని ప్రాణార్పణ ప్రదక్షిణలు
అగ్గి పెట్టెల్లో దాచే బంగారు పురుగులు
ఆస్థిపాస్తులంటు మురిసిన చిన్నారులు
రసాయన సాగుతో తరమొద్దు పురుగులు
అపురూప గురుతులు మాపల్లెఅందాలు !

– మధుపాలీ
9949700037

# బేల చూపులు



దేవాలయాలు దయ్యాల కొంపలయినవి
న్యాయాలయాల చేష్టలుడిగినవి
జాలి , క్షమ, ఆత్మ, ప్రేమలు అడుగంటినవి
కామ ప్రకోపాలే రాజ్యమేలుతున్నవి
రక్షకుడే భక్షకుడవుతున్నాడు
మానవుడే దానవరూపు దాల్చి నాడు
మానవతుల మాన ప్రాణాలను హరించుడే
నిత్యకృత్య నైవేద్యాలుగా భావిస్తున్నాడు
ప్రకృతి వికృతి తమ ఆకృతులు కోల్పోయినవి
భూదేవి శ్రీదేవి తలలు వాల్చినవి
నింగి కనులు కన్నీళ్ళ కుండలైనవి
గాలి పిరికిదైన బేలచూపులే మిగిలినవి

–నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470

# విలక్షణ వ్యక్తిత్వం 'ఎమ్మా' సొంతం



ఆంగ్ల సమాజంలో, 19వ శతాబ్ద ప్రారంభం నాటి ఆర్థిక, సామాజిక అంతరాలను ప్రతిబింబించే నవల 'ఎమ్మా'. జేన్ ఆస్టిన్ రచించిన ఈ నవల 1815లో ప్రచురితమైంది. ఉడ్‌హౌస్ హైబరీ అనే గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ అందమైన, తెలివైన, సంపన్న యువతి 'ఎమ్మా' పాత్రను ఆస్టిన్ మలచిన తీరు అద్భుతం. తప్పులు చేయడం, వాటిని సరిద్దుకోవడం, తనను తాను తెలుసుకోవడం, సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడం వంటి జీవితంలోని అనేక కోణాలు ఎమ్మా జీవితంలో కనిపిస్తాయి. హైబరీ గ్రామంలో, తన తండ్రితో కలిసి నివసిస్తున్న యువతి ఎమ్మా. ఆమె హ్యారియెట్ స్మిత్ అనే దిగువ తరగతి అమ్మాయితో స్నేహం చేస్తుంది. హ్యారియెట్ జీవన శైలిని అనుకరించడానికి చేసే ప్రయత్నాల్లో తరచు పొరపాట్లు చేస్తుంది. ఒక్కోసారి చిక్కుల్లో పడుతుంది. హైబరీ గ్రామంలో అంతా ఎమ్మా తీరును విస్మయంగా చూస్తూ ఉంటారు. కొందరు ఆమె వైఖరిని విమర్శిస్తారు. అయితే, ఎమ్మా తన ప్రయత్నాలను కొనసాగిస్తుంది. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటుంది. వ్యక్తిగతంగా ఉన్నత ప్రమాణాల కోసం కృషి చేస్తుంది. ఎన్నోసార్లు స్వీయ ఆవిష్కరణను ఎదుర్కొంటుంది. తనలోని లోపాలను తెలుసుకుంటుంది. విశ్లేషించుకుంటుంది. సరిదిద్దుకుంటుంది. అపార్థాలను తొలగించుకుంటుంది. వినయంగా ఉండడం, తాను చేయదలచుకున్న పనులను శ్రద్ధగా చేయడం అలవాటు చేసుకుంటుంది. ఒక సంపూర్ణ వ్యక్తిత్వంగల మహిళగా తనను తాను ఆవిష్కరించుకుటుంది. ఈ నవల 19వ శతాబ్దపు ప్రారంభంలో ఉన్న పరిస్థితులను మనకు కళ్లకు కడుతుంది. పాత్రలను ఆస్టిన్ తీర్చిదిద్దిన తీరు గొప్పగా ఉంటుంది. ఎమ్మాలో పాఠకులు తమను తాము అర్థం చేసుకుంటున్న భావనకు లోనవుతారు. ఈ నవల శృంగార సంబంధాల సంక్లిష్టతను కూడా పరిశోధిస్తుంది. మానవ సంబంధాల ప్రాధాన్యతను గుర్తుచేస్తుంది. ఆనాటి సామాజిక నిబంధనలను వివరిస్తుంది. ప్రజల అంచనాలను, అందులోని చిక్కులను విశ్లేషిస్తుంది. నవల్లోని ప్రతి పాత్రను ఆస్టిన్ గొప్పగా మలచింది. ఎమ్మా పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. ధనిక, పేద వర్గాల మధ్య తేడాలు, సామాజిక కట్టుబా ట్లు, సమస్యలు వంటి అత్యంత క్లిష్టమైన, వివాదాస్పదమైన అంశాలను ఆస్టిన్ వ్యంగ్యం గా వివరించిన తీరు, తర్వాతి తరంలో ఎంతో మందికి మార్గదర్శకమైంది. చిన్నిచిన్న పాత్రలు... సంఘటనలు.. మాటలతో కూడా సంక్లిష్టమైన అంశాలను చర్చించవచ్చని నిరూపించిన ఆస్టిన్‌ను ప్రశంసించడానికి ఎన్ని విశేషణాలు ఉన్నా తక్కువే. సాహిత్యాభిమానులు, ప్రత్యేకించి ఆంగ్ల సాహిత్యం ఇష్టపడేవారు తప్పక చదవాల్సిన నవల 'ఎమ్మా'.

# తిలక్ ఎందుకో వెనుకబడ్డాడు

దేవరకొండ బాలగంగాధర్ తిలక్ అనగానే 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి ముందుగా గుర్తుకొస్తుంది. శ్రీశ్రీ, అజంతా సరసన నిలిచే ప్రతిభ ఉన్నా, తిలక్ ఎందుకో వెనుకబడ్డాడు. బహుశా ప్రచారం అంటే ఇష్టం లేక కాబోలు. అతను మనసు ఎంత సున్నితమో, కవితలు అంత పదునైనవి. తొలుత దేవులపల్లి కృష్ణశాస్త్రి... తదనంతర కాలంలో శ్రీశ్రీ ఆయనకు మార్గదర్శకులయ్యారు. ఇద్దరి ప్రభావం నుంచి బయటపడి, వచన కవిత్వంలో తిరుగులేదని నిరూపించుకున్నాడు. తెలుగు సాహితీ ప్రపంచంలో తదంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలంలోని మండపాక గ్రామంలో 1921 ఆగష్టు 1న జన్మించిన తిలక్, నలభై ఐదేళ్ల వయసులో, 1966 జూలై 1న అనారోగ్యంతో మరణించాడు. ప్రతి తెలుగు గుండె గర్వంతో ఉప్పొంగేలా అద్భుత కవితా సంపదను అందించి వెళ్లాడు. తిలక్ మరణించిన ఏడాదిలోపు, 1967 ఏప్రిల్‌లో అతను రాసిన కథలతో 'తిలక్ కథలు', రెండేళ్ళకు 1968 జులైలో అతని కవితలతో 'అమృతం కురిసిన రాత్రి' అన్న కవితా సంపుటిని విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురించింది. ఇది తెలుగు సాహిత్యంలో మంచి ఆదరణ పొందింది. 1971లో ఈ పుస్తక రచనకు గాను మరణానంతరం తిలక్‌కు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. తిలక్ భావకుడు. అభ్యుదయవాది. స్వాప్నికుడు. ఆదర్శవాది. అతని రచనల్లో మన చుట్టూ ఉండే, తరచు తారసిల్లే బిచ్చగాళ్ళు, అనాథలు, అశాంతులు, దగాపడ్డ తమ్ముళ్ళు, పడుపుగత్తెలు, చీకటిబజారు చక్రవర్తులే ఉంటారు. అణగారిన వర్గాలు.. దోపిడికి గురైన బాధితులు.. నిత్యం బతుకుపోరాటాలు చేసే అభాగ్యులు ఎదుర్కొంటున్న సమస్యలే తిలక్ కవితా వస్తువులు. ఆయన పలకరించని సామాన్యుడు లేడు. ఆరంభంలో, భావ కవిత్వ ప్రభావంతో, ఛందస్సులో విస్తృతంగా కవిత్వం రాశాడు. గోరువంకలు, స్వయంవరక, ఆవాహన, వర్ష, మధువిరహం, శర్వరీప్రియ, అద్వైతమాన్మథం, అమృతభావం వంటి ఎన్నో ఖండకావ్యాలను ఆయన కలం సృష్టించింది. ఆతర్వాత శ్రీశ్రీ కవిత్వం పెనుతుపానుగా మారి, తెలుగు నేలను చుట్టినప్పుడు, అభ్యుదయ కవిత్వాన్ని ఆలింగనం చేసుకున్నాడు. భావుకతకు అభ్యుదయం జత కలిసిందేమో, కళ్ల ముందు కనిపించే ప్రతి సమస్యనూ తన కవిత్వంలో చేర్చుకున్నాడు. అన్నార్తుల కోసం అలమటించాడు. సంప్రదాయవాదాన్ని ఖండించి, సమసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించాడు. అణచివేత కారణంగా అట్టడుగున ఉండిపోయిన కోట్లాది మంది అభ్యుదయాన్ని ఆకాంక్షించాడు.

'దేవుడా
రక్షించు నాదేశాన్ని
పవిత్రులనుండి, పతివ్రతలనుండి
పెద్దమనుషుల నుండి, పెద్దపులులనుండి
నీతుల రెండునాల్కలు సాచి బుసలుకొట్టే
నిర్హేతుక కృపా సర్పాలనుండి
లక్షలాది దేవుళ్లనుండి వారి పూజారులనుండి
వారి వారి ప్రతినిధుల నుండి
సిద్ధాంత కేసరులనుండి



శ్రీమన్మద్గురు పరంపరనుండి'... ఇందులోని ప్రతి భావం అక్షరసత్యమే. ఇలాంటి వారి నుంచి ఈ సమాజాన్ని, దేశాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎలుగెత్తి చాటిన ధీరుడు తిలక్. అందుకే, తిలక్‌ను ప్రస్తావిస్తూ తన ఎలిజీలో..

'యువ కవి లోక ప్రతి నిధి
నవభావామృత రసధుని
కవితాసతి నొసట నిత్య
రసగంగాధర తిలకం
సమకాలిక సమస్యలకు
స్వచ్ఛ స్ఫటికా ఫలకం' అని అభివర్ణించాడు. తెలుగు సాహిత్యానికే తిలక్ వల్ల సార్థకత లభించిదనడం అతిశయోక్తి కానేకాదు. వ్యావహారిక భాష, రసదృష్టి, వాస్తవికతా దృక్పథం తిలక్ సాహిత్యాన్ని పరిపూర్ణం చేశాయి. భావుకతతో పెనవేసుకున్న అభ్యుదయాన్ని అతనిలా ఆవిష్కరించిన రచయిత అంతకు ముందుగానీ, ఆ తర్వాతగానీ లేడు.. ఇక రాడు. అతను రాసిన ప్రతి కవిత కొత్త శిల్పంతో, సరికొత్త భావంతో రక్తికడుతుంది. సగటు జీవి ఎదుర్కొనే ప్రతి సమస్యపైనా స్పందించే సున్నిత మనస్తత్వమే తిలక్‌ను కొంత కాలం మానసిక ఒత్తిడికి గుఇ చేసింది. తండ్రి మరణం అతని హృదయాన్ని కలిచివేసింది. పదేళ్లపాటు అతను సాహిత్యానికి దూరమై, ఎంతో ఆవేదనతోనూ, ఆందోళనతోనూ గడిపాడు. 1956లో ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత, తిరిగి రచనలు ప్రారంభించాడు. సాహితీ స్రష్టగా మారాడు. ఒక రకంగా చెప్పాలంటే ఆ చివరి పదేళ్లు అతని జీవితంలో కీలకమైనవిగా చెప్తారు. అనారోగ్యం వెంటాడినా... ఆర్థికంగా చితికిపోయినా... రచనా వ్యాసాంగాన్ని మాత్రం వీడలేదు.

'గాజుకెరటాల వెన్నెల సముద్రాలు
జాజిపువ్వుల అత్తరు దీపాలు
మంత్రలోకపు మణి స్తంభాలు
నా కవితా చందనశాలా చిత్రవిచిత్రాలు
నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు'... నిజమే. ఇంత రమ్యంగా చెప్పడం తిలక్‌కు తప్ప మరెవరికైనా కష్టమే. నైతికమైన నిబద్ధతతో, ధర్మనిష్ఠతో రచనలు సృజించాడు. మనిషి హితాన్ని కోరాడు. సమసమాజాన్ని ఆహ్వానించాడు.

తిలక్ కథలు, కవితలు, కావ్యాలు పాఠకుల మన్సును దోచుకుంటాయి. అదే సమయంలో లోతుగా ఆలోచింప చేస్తాయి. 'అమృతం కురిసిన రాత్రి'లో 'ఆర్తగీతం' తిలక్ నిశిత పరిశీలనకు, బాధితుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం. అభాగ్యులు, అన్నార్తులు ఉన్నంతకాలం దేశాన్ని గురించి పాడలేనని తెగేసి చెప్తాడు. 'ఈ రోజు నాకు విషాదస్మృతి, విధి తమస్సులు మూసిన
దివాంధరుతి' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తాడు. 'నా యెదద మ్రోడైన ఒక దుస్థితి' అని తన పరిస్థితిని వివరిస్తాడు. నిజాలు చూడలేని చరిత్ర పుటలను తిరస్కరిస్తూ 'గత చారిత్రక యశఃకలాపమ్ము వివరింపకు, బహళ వీరానేక గాథాసహస్రమ్ము వినిపింపకు.. ఇంక నన్ను విసిగింపకు' అని తెగేసి చెప్తాడు.




'నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాణ్ణి..
నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెనకింద నిండుచూలాలు ప్రసవించి మూర్ఛిలిన దృశ్యాన్ని!
నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికికాల్వ పక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి; నేను చూశాను నిజంగా పిల్లలకు గంజి కాసిపోసి తాను నిరాహరుడై.. రుద్ధబాష్పాకులిత నయనుడై ఆఫీసుకు వచ్చిన వృద్ధుని... ఫ్యూన్ వీరన్నని' సమాజం ఎంత ఘోరంగా ఉందో.. పరిస్థితులు ఎం త భయానకంగా మారాయో కళ్లకు కడతాడు తిలక్. ఆకలితో అల్లాడిన ముదుసలి... వర్షం పడుతున్న వేళ, వంతెనే కింద తలదాచుకొని, అక్కడే ప్రసవించిన ఓ తల్లి... ఏడ్చి ఏడ్చి కన్నీరు ఇంకిపోయి, మురికికాలువ పక్కనే నిద్రపోయిన పసివాడు.. పిల్లల కోసం తాను పస్తులుండే వృద్ధ ఫ్యూను.. వీరే తిలక్ స ర్వస్వం.అన్నీ కాకపోయినా, ఒకటో రెండో ఇలాంటి దృశ్యాలను మనలో ప్రతి ఒక్కరం చూసే ఉంటాం. కానీ, మన గాజు కళ్లు పట్టించుకోవు. నిర్లప్తంగా.. నిర్లక్ష్యంగా ముందుకు సాగిపోతాం. తిలక్ లాంటి వారు మాత్రమే స్పందిస్తారు. బాధపడతారు. వారి దైన్యాన్ని కళ్లకు కడతారు. అందుకే తిలక్ అసమాన్యుడిగా ఎదిగాడు. అమరుడయ్యాడు.



ఖమ్మం పట్టణంలో జరుగుతున్న రాష్ట్ర సిపిఐ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నాయకులు కామ్రేడ్ కలవేన శంకర్, జిల్లా ఇన్ చార్జ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యస్.విలాస్. అదిలాబాద్ జిల్లా కార్యదర్శి మునుపు ప్రభాకర్ రెడ్డి, కామ్రేడ్ రామడుగు లక్ష్మన్, మంచిర్యాల్ కార్యదర్శి, కామ్రేడ్.మెట్టు పల్లి వెంకటస్వామి, ఆర్.చంద్ర శేఖర్, మల్లయ్య, ముడుపు నళిని రెడ్డి, పుర్ణిమ తదితరులు.

## కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ఆయకట్టు కింద అలీసాగర్ వరకు సాగు చేస్తున్న వానాకాలం పంటల సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని ప్రధాన కాలువ ద్వారా ఈనెల 23వ తేదీనా విడుదల చేశారు. నిజాం సాగర్ ప్రాజెక్టు నీటిపారుదలశాఖ అధికారి శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, 17.802 టీఎంసీలు కాగా ప్రస్థుతం ప్రాజెక్టులో 1388.66 అడుగులు, 3.537 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన వెళ్ళడించారు. కాగా నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద రైతులు సాగు చేస్తున్న పంటలకు గాను ప్రధాన పంట కాలువ ద్వారా 1505 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## డిఎస్ మృతికి సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** పిసిసి మాజీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ తాను విద్యార్థి దశ నుండి తుది శ్వాస వరకు రాజకీయాల్లో అనేక పదవులో ఉంటూ ప్రజలకు సేవలందించడం జరిగిందని సిపిఐ నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లోని ధర్మపురి శ్రీనివాస్ స్వగృహంలో ఆయన పార్థివదేహంకు సిపిఐ బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ బృందంలో సిపిఐ నాయకులు పి.సుధాకర్, కె. భూమయ్య, వై.ఓమయ్య, కె.రాజయ్య, పి.ముత్యాలు, రంజిత్‌కుమార్, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పెద్దపల్లి రిపోర్టును ప్రవేశపెట్టిన తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గత రెండు రోజులుగా ఖమ్మం లో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర నిర్మాణా కౌన్సిల్ సమావేశంలో పెద్దపల్లి జిల్లా రిపోర్ట్ ప్రవేశ పెట్టినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పెద్దపెల్లి జిల్లాలో సిపిఐ పార్టీ నిర్మాణం మరియు పార్టీ కార్యక్రమాలను వివరించారు.

## లయన్స్ క్లబ్ సేవలు విస్తృత పరచాలి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రతి గ్రామంలో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరచాలని లయన్స్ క్లబ్ ఉప గవర్నర్ మోర బద్రేశం అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటు చేసిన మల్లాపూర్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హజరై మాట్లాడారు. గత ఎనిమిది సంవత్సరాలుగా మల్లాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ప్రజలకు విశిష్టంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన తోట రాజారాం, కార్యదర్శి, కోశాధికారులతో ప్రమాణ స్వీకారం చేయించి, అభినందనలు తెలిపారు. పాల్గొన్న వారిలో రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, జోనల్ చైర్మన్ శంకర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు డీలర్ మల్లయ్య, సంజూ రాంప్రసాద్, సభ్యులు తోట రాజ రెడ్డి, జైపాల్ రెడ్డి, రమేష్, సురేష్ రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు జులై 1 నుండి 31 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదివారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరపరాదు, నిషేదిత ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం ప్రోగు అవుట, లౌడ్ స్పీకర్‌లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేధం అని, నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ అక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని ఎస్పీ పేర్కొన్నారు.

## జెడ్‌పిటిసిగా అజయ్ కుమార్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వాంకిడి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్‌పిటిసిల, ఎంపిపిల పదవి కాలం ముగియడంతో ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి, జెడ్‌పి చైర్మన్ కోనేరు కృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాంకిడి మండల జడ్‌పిటిసి అజయ్ కుమార్ ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, వారి కష్టాలలో అందుబాటులో ఉంటూ, పార్టీ నియమనిబంధనలు పాటిస్తూ తనదైన శైలిలో వ్యవహరిస్తూ పార్టీని కాపాడుకుంటూ వచ్చారని, అటు రాజకీయ రంగంలో, ఇటు వైద్య రంగంలో పేద ప్రజలకు అనేక సేవలను అందించారని కొనియాడారు.

# రాజకీయాలకతీతంగా ఆసిఫాబాద్ అభివృద్ధి

మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



**ప్రజాపక్షం/కాగజ్ నగర్/ఆసిఫాబాద్ :** జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో అధికారులకు సహకరించే బాధ్యత ప్రజా ప్రతినిధులదని, మంచి నిర్ణయాలతో అభివృద్ధి చేసే బాధ్యత అధికారులదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఆదివారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోనేరు కృష్ణారావు, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి అంకిత భావంతో జిల్లాను అభివృద్ధిలో ముందంజలో ఉండే విధంగా సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. కాగజ్ నగర్ మండలం శ్రీరాంనగర్ లోని పల్లె దవాఖాన, ఈస్గాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కాగజ్ నగర్ పట్టణంలోని 12వ వార్డులో గల పల్లె దవాఖాన, ఎఎంసి (కాపు వాడ) లోని మిషన్ భగీరథ అర్బన్ వాటర్ సప్లయి పథకాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించే అవకాశం ప్రజలు కల్పించారని, అధికారంలో లేని సమయంలో సైతం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేశామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడుతూ ఆయా జిల్లాలలో కలెక్టర్లుగా, అధికారులుగా మీపై ఉన్న నమ్మకంతో నియమించడం జరిగిందని, ఈ నమ్మకాన్ని పూర్తి స్థాయిలో కాపాడుకుంటూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించేలా విధులు నిర్వహించాలని తెలిపారని వివరించారు. అధికారుల బదిలీలలో రాజకీయ ప్రమేయం ఏ మాత్రం ఉండదని తెలిపారు. ప్రజాప్రతినిధిగా పదవి అనేది అలంకారం కాదని, బాధ్యతతో ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ కార్యవర్గం రైతుల సంక్షేమం కోసం అధికారుల సమన్వయంతో పనిచేయాలని, కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువులను అరికట్టాలని, రైతులు తీసుకువచ్చిన పంట దిగుబడిని దళారీల పాలు కాకుండా సరైన మద్దతు ధర అందించి రైతు లబ్ధి పొందే విధంగా కృషి చేయాలని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి సేవలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని అన్నారు. పోడు రైతులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో పోడు వ్యవసాయ సాగు చేస్తున్న రైతులకు భరోసా కల్పించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించి సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని, సిర్పూర్ పేపర్ మిల్లు పరిశ్రమను పునరుద్ధరించి స్థానికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ ప్రకారంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### అన్ని రకాల విద్యా సౌకర్యాలు కల్పిస్తాం

ప్రస్తుత విద్యా సంవత్సరంలో డైట్ కళాశాలలో చేరే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నాలుగు కోట్ల వ్యయంతో నిర్మించిన డైట్ కళాశాలను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు జెడ్‌పిటిసి నాగేశ్వరరావు, ఎంపిపి మల్లికార్జున్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైట్ కళాశాల ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉండాలని దృఢ సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు.

## నిత్యం ప్రజాక్షేత్రంలో ప్రజా ప్రతినిధులు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/చందుర్తి :** చందుర్తి మండల సాధారణ సర్వసభ్య సమావేశం చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సాదాసీదాగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అందజేసే ప్రగతి నివేదికలు మండలంలో జరిగిన అభివృద్ధి పనులకు ప్రతిబింబంల ఉండాలని అన్నారు. అధికారులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తీర్చాలని సూచించారు. జూలై మూడవ తారీకుతో ఎంపీటీసీ జెడ్పీటీసీల పదవీ కాలం ముగుస్తుండడంతో వారికి సలహాలు సూచనలు చేశారు. పదవితో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తీరిస్తే ప్రజలే తమకు ఉన్నత స్థానాలు కల్పిస్తారని, అందుకు నిదర్శనం తానేనని గుర్తు చేశారు. అనంతరం సభ్యులను శాలువాతో సన్మానించారు. చందుర్తి ప్రజల చిరకాల వాంఛ చందుర్తి మోత్కరావుపేట రోడ్డు అటవీశాఖ అనుమతులు రానున్న పది, పదిహేను రోజులలో పూర్తిచేసి వర్షాకాలం ముగియగానే ఆ రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలోని 54 సర్వే నెంబర్ లో గల 45 గుంటల భూమిలో 20 గుంటల స్థలాన్ని ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణానికి, మిగతా స్థలాన్ని గ్రామంలోని భూమిలేని నిరుపేదలకు అందజేసి, ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున అందజేస్తామని అన్నారు. మండలంలోని అంతర్గత రోడ్లు, సిసి రోడ్ల నిర్మాణాలు , ఇతర సమస్యలు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ న్యలకొండ అరుణ, జెడ్పిటిసి నాగం కుమార్, ఎంపీపీ బైరగొని లావణ్య, ట్యాక్స్ చైర్మన్లు జలగం కిషన్ రావు,తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ ఉండాల శ్రీనివాసరావు, అధికారులు,ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## ఖమ్మంపల్లిలో పడకేసిన పారిశుధ్యం

పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలోని పలు వీధుల్లో చెత్తాచెదారంతో అపారిశుధ్యం నెలకొంది. దీంతో, వ్యాధు లు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు ఉపయోగించిన చెత్తచేదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులన్ని డ్రైనేజీలో ఒకే చోట పడేయడంతో డంపింగ్ యార్డుల తలపిస్తుంది. రోడ్డు పక్కనే పడేయడంతో తీవ్రమైన దుర్వాసన వస్తుంది. ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే స్థానిక గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో ఆ చుట్టుపక్కలనున్న నివాస గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో దుర్వాసనతో పాటు దోమలు మరింత వృద్ధి చెందే అవకాశం ఉందని దానివల్ల వ్యాధులు మరింత ప్రభలే అవకాశముంటుందని గ్రామస్తులు భయపడుతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పేరుకుపోయిన పారిశుద్ధ్యాన్ని వెంటనే తొలగించి, భవిష్యత్తులో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి

పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మహిళలు తమ స్వశక్తితో ఎదగాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో అభయ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 3 నెలల పాటు ఉచిత కుట్టు శిక్షణ,మెహందీ తరగతులు శిక్షణ పూర్తియనందున సందర్భంగా పెద్దపల్లి ఏమ్మెల్యే విజయరామణారావు చేతుల మీదుగా మహిళలకు కుట్టు మిషన్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. అభయఫౌండేషన్ ఆధ్వర్యంలో 34 మంది మహిళలకు ఉచిత శిక్షణతో పాటు సర్టిఫికెట్ సబ్సిడీతో మిషన్స్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు తమ స్వంత ఉపాధి మార్గాన్ని ఎంచుకొని కుంటుంబానికి ఆసరాగా నిలిచేలా ఉండాలని మహిళలు ముందుకొస్తే ఏదైనా సాధించగలరని అన్నారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలాజిరావు,ఎంపీడీఓ దివ్య దర్శనరావు,అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకు బాలచంద్ర, మాజీ సర్పంచ్ వీరగోని సుజాత రమేష్,ఎంపీటీసీ పులి అనూష, కో ఆర్డినేటర్ అరుణ, ట్రైనర్ స్వప్న, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం,మాజీ సింగిల్ విండో చైర్మన్ జానీ,మహిళలు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** పోలీస్ సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, కేసుల్లో సాంకేతికపరమైన సహాయం అందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని కొమురం భీం ఆసిఫాబాద్ ఎస్పి డి.వి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గల డిసిఆర్‌బి (డిస్ట్రిక్ క్రైమ్ రికార్డ్ బ్యూరో), ఐటి కోర్, డిపిఒ పలు విభాగాల్లోని కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రతి రికార్డులు అప్ టు డేట్ ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించిన అన్ని సర్వీస్ బుక్కులను, లీవ్ అన్ని రకాల రిజిస్టర్స్‌ని పరిశీలించారు. ప్రతిదీ ఆన్ లైన్‌లో అప్ టు డేట్ ఉండాలని తెలియజేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్, ఎఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు. భరోసా సెంటర్ ద్వారా ఇప్పటివరకు రిజిస్టర్ అయిన కేసులను, భరోసా సెంటర్ ద్వారా సహాయం పొందిన మహిళలు, బాలికల యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెల్ ఆఫ్ ఆమ్స్‌లో గల వివిధ ఆయుధాలను, వాటి యొక్క కండిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయుధాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలని విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, ఎస్‌బి సిఐ రాణా ప్రతాప్, డిసి ఆర్ బిసిఐ రమేష్, అడ్మిన్ ఆర్ఐ పెద్దయ్య ఎంటి ఆర్ ఐ అంజన్న, భరత్ భూషణ్, ఏవో శ్రీనివాస్, ఏ సూపర్డెంట్ ,బిసూపర్డెంట్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సిర్పూర్ ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి పురస్కారం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రస్థాయి బాలసాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి సిర్పూర్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు ఆదివారం సిద్ధిపేట్‌లో అందుకున్నారు. శ్రీవాణి సాహిత్య పరిషత్, పెందోట బాలసాహిత్య పీఠం సిద్ధిపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి బాలసాహిత్య పురస్కారాల సభను నిర్వహించి అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కాసర్ల రచించిన బడిపిల్లల నాటికల సంపుటి 'జై విజ్ఞాన్' పుస్తకానికి ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారం కింద కాసర్లకు శాలువ మెమెంటో సర్టిఫికెట్ నగదు పురస్కారాన్ని నిర్వాహకులు సంస్థ అధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సన్మాన సభలో ప్రముఖ కవులు డాక్టర్ దాశరథుల బాలయ్య, ఐతా చంద్రయ్య, డాక్టర్ కొండల్ రెడ్డి, వాసర వేణి, పరశుఉరాముఉలు, రాంచంద్రారెడ్డి, ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన సుమారు 100 మంది కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ కాసర్ల నరేష్ మాట్లాడుతూ బాలసాహిత్య పుస్తకాలకు రాష్ట్రస్థాయిలో పోటీ నిర్వహించగా అందులో తాను రచించిన 'జై విజ్ఞాన్' బడిపిల్ల నాటికల పుస్తకం ఎంపికైనందుకు సంతోషంగా ఉదన్నారు. సంస్థ బాధ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సుమారు 3 దశాబ్ధాలుగా జిల్లాలో సాహిత్య సేవలందిస్తున్న డాక్టర్ కాసర్ల నరేష్‌రావు ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక అధ్యక్షులుగా ఉంటూ ఇటీవలే సిర్పూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా చేరారు.

## అభివృద్ధి లేక కుంటుపడుతున్న గ్రామాలు




**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** తెలంగాణ ఏర్పడి10 సంవత్సరాలు గడుస్తున్న గ్రామీణ పల్లె ప్రాంతాలు ఎన్ని ప్రభుత్వాలు మారిన ఇంకా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందకపోవడం విడ్డూరమే అని అనుకోవాలి. 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో కొత్తగా ఏర్పడి 9 సంవత్సరాల పాలన చేసిన మారుమూల గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి అంతంత మాత్రమేనని అభివృద్ధి కోసం గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పరిచి పల్లెలు పచ్చదనంలో ఉండాలని పల్లెల కోసం ఎన్నో మహత్తర కార్యక్రమాలు ఏర్పరచిన అవి అమలు పరచడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పొచ్చు. గత సంవత్సరం 2023 అసెంబ్లీ ఎన్నికలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయి తెలంగాణలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్న పల్లెల అభివృద్ధి విషయంలో నామమాత్రం చూపు ఉందని పల్లెల్లో అభివృద్ధికి నిధులు ఇప్పటి వరకు ఏమాత్రం విడుదల కాలేదని గత సంవత్సరం అక్టోబర్ నుండి ఎన్నికల కోడ్ వలన గ్రామాలలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదని అలా మంజూరు చేయకపోవడం వలనే గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిపోతుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. 2024 ఫిబ్రవరితో గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించి గ్రామ కార్యదర్శులతో పాలన కార్యక్రమాలను అభివృద్ధి కార్యక్రమాలను నిర్వర్తిస్తూ వీరు దగ్గరుండి విధులను చూసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిన నిధులు లేక అభివృద్ధి పనులు ఏం చేయాలో తోచక గ్రామ కార్యదర్శులు అపసోపాలు పడుతున్నారు. గోవిందరావుపేట మండలంలోని అన్ని గ్రామాల పరిస్థితి అయితే అంతంత మాత్రమేనని అభివృద్ధి కార్యక్రమాలు లేక అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు కాక గ్రామాల్లో ప్రజలు అయోమయ స్థితిలో ఉంటున్నారు. వచ్చేది వర్షాకాలం గనుక గ్రామాలలో ప్రజలు వారి గ్రామాలలో పరిస్థితులను ప్రత్యేకాధికారులకు, కార్యదర్శులకు విన్నవించుకోవాలని చూసిన వారి నుండి వచ్చే సమాధానం నిధులు లేకనే మేము ఏం చేయలేకపోతున్నామన్న సమాధానంతో గ్రామస్తులు విసిగిపోతున్నారు. వచ్చే వర్షాకాలన్ని ఎలా గడపాలని గ్రామాలలో డ్రైయినేజీ లేక సరైన రోడ్లు లేక ఇప్పటికే ఎన్నో సంవత్సరాల బట్టి సరైన అభివృద్ధి లేక మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక అయినా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్న ఆశతో ఉన్న మారుమూల గ్రామాల ప్రజలు సైతం నిరుత్సాహంతో ఉన్నారు. తెలంగాణలో కొత్తగా వచ్చిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎంతో ఆశతో ఎదురుచూసిన గ్రామస్తులు నిరాశలో ఇపట్టి వరకు గ్రామాలకు నిధులు విడుదల కాక చేయాల్సిన అభివృద్ధి పనులు చేయపోవడం వలన గ్రామాలలో అభివృద్ధి ఇప్పటి వరకు ఏ మార్పు లేకపోయింది. గత సంవత్సరం నుండి గ్రామాలకు నిధులు మంజూరు కాకనే మేము ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేకపోతున్నామని కార్యదర్శులు అంటున్న వారి శాయశక్తులతో కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు వీధి దీపాలు, మంచినీటి ఎద్దడి గ్రామాల్లో రాకుండా తగు చర్యలు తీసుకుంటు శాయశక్తుల వారి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు అధికారులు చొరవ తీసుకొని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యే విధంగా ప్రయత్నం చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని గ్రామస్తులు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుకుంటున్నారు.

## దొడ్డికొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటివేణు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరుడు కామ్రెడ్ దొడ్డికొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటివేణు, రాష్ట్ర యాదవసంఘం నాయకులు వీరవేణి మల్లేషం ఎల్లారెడ్డిపేటలో అన్నారు. ఆదివారం సిరిసిల్లాలో జరిగే దొడ్డి కొమురయ్య సభ కరపత్రాన్ని యాదవ సంఘం సభ్యులు పాల్గొని ఆవిష్కరించారు. రాజన్నసిరిసిల్లాలో జూలై 4న వాసవికళ్యాణ మండపంలో 78వ వర్ధంతి సన్నాహక కమిటీగా ఏర్పడి ఘనంగా నివాళి సభను ఏర్పాటు జరుగుతుందన్నారు. దొడ్డికొమురయ్య గొర్రెల పెంపకం దారుల కుటుంభంలో జన్మించారని నైజాం సర్కారు, భూస్వాముల, జమిందారుల దొరలదోపిడి, వెట్టిచాకిరి, భానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. రజాకార్ల గుండాల దాడులను ఎదుర్కొన్న ఏకైకవ్యక్తి కొమురయ్య అని చెప్పారు. 1969 తొలి, మలిదశలో తెలంగాణకు స్ఫూర్తియే దొడ్డి కొమురయ్య వీరమరణం పొంది అమరడయ్యాడని గుంటి వేణు సంభోదించారు. ఇలాంటి అమరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు అందించడానికి రాజన్నసిరిసిల్లా జిల్లాలో దొడ్డికొమురయ్య కాంస్య విగ్రహన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. సభకు వక్తలుగా టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకటరెడ్డి, సిరిసిల్లా మున్సిపల్ చైర్ పర్సన్ జిందంకళా చక్రపాణి, మాజీ చైర్మెన్ తుల ఉమ, సిరిసిల్లా కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహెందర్‌రెడ్డి హాజరు కానున్నరని అన్నారు. ఈ సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు కానపురం లక్ష్మణ్, యాదవసంఘం రాష్ట్ర కార్యదర్శి వీరవేణి మల్లేషం యాదవ్, బుర్రమల్లేషంగౌడ్, మెండె శ్రీనివాస్ యాదవ్, మాందాటి దేవేందర్ యాదవ్, ద్యాపదేవయ్య, అనవేని రవియాదవ్, మల్యాల ఎల్లంయాదవ్, బట్టు దేవ య్య, కరపత్రం ఆవిష్కరణలో పాల్గొన్నారు.

CHANGE OF NAME
I Thiruapthi Devaraneni S/o Bapu D, DOB : 10/09/1979. have changed my name from Thiruapthi Devaraneni to Devaraneni Thirupathi S/o D Bapu, DOB 10/09/1979 For all Records purposes.

# అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### మహిళా సమాఖ్య డిమాండ్




**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** చిన్నపిల్లలు, మహిళలకు అత్యాచారాలకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సమైఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్‌లోని పోచమ్మైదాన్ సెంటర్‌లో ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ వరంగల్ మండల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బినగర్‌లో నాలుగు సంవత్సరాల పాపపై జరిగిన అత్యాచారానికి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాయల మాట్లాడుతూ అత్యాచారానికి గరైన పాపకు సరైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసై చిన్నపెద్ద తేడా లేకుండా మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యాచార నిందితులకు ఉరిశిక్ష విధించాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ మండల కార్యదర్శి బచ్చల స్వప్న, నేతవత్ లక్ష్మి, ఐరబోయిన అనూష, సరస్వతి, భార్గవి, రాసమల్ల భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డులు జారీ చేసి సంక్షేమ పథకాలు అందించండి

### ప్రభుత్వానికి సిపిఐ, ఎఐవైఎఫ్ వినతి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ వెంటనే చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బోడలదిన్నె గ్రామంలో జరిగిన సిపిఐ ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి అని అధికారులు అడుగుతున్నారన్నారు. దీంతో అర్హులైన వారు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. గత ప్రభుత్వం రేషన్‌కార్డులు జారీ చేయకుండా ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అనేక మందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు అనర్హులుగా గుర్తిస్తుంచబడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్‌కార్డులు అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, సిపిఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఎఐఎస్ఎఫ్ నాయకులు కొమ్రరాజు వెంకట్, రైతు సంఘం నాయకులు యల్లబోయిన వెంకన్న, యల్లబోయిన నరసయ్య, దామరచర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా ప్రైవేట్ హాస్టళ్లు

### ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులకు అస్వస్థత
### శ్రీచైతన్య కాలేజీ హాస్టల్ మూసివేయాలి
### విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్
### ఆసుపత్రిలో విద్యార్థులకు పరామర్శ




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ నగరంలో పాఠశాలలు, కళాశాలలు విచ్చలవిడిగా ప్రైవేట్ హాస్టళ్లు నిర్వహిస్తున్నారని, వాటిపై ప్రభుత్వ పర్యవేక్షణ కరువయిందని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విమర్శించారు. పట్టణంలోని మంకమ్మతోటలో గల శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌లో టిఫిన్ తిన్న విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికావడం కళాశాల నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. హాస్టల్‌ను మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. అస్వస్థకు గురైన విద్యార్థులను నగరంలోని రాఘవేంద్ర హాస్పిటల్‌లో ఆదివారం ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్, నగర కార్యదర్శి చెంచల మురళి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, నగర కార్యదర్శి వినయ్ సాగర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, వినయ్ పరామర్శించారు. శ్రీచైతన్య కళాశాల యాజమాన్య మొండి వైఖరిని నిరసిస్తూ కళాశాల ముందు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా నాయకులు మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో విచ్చలవిడిగా ప్రైవేట్ హాస్టళ్లు నెలకొన్నాయని, వీటిని పర్యవేక్షించే అధికారులే లేకపోవడం వల్ల ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రైవేట్ హాస్టళ్లు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. శ్రీ చైతన్య కాలేజీలో ఉదయం జరిగిన సంఘటన దీనికి ఉదాహరణ అని ఆయన ఆరోపించారు. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేట్ కళాశాలలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వీరిని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతి రోజు ఇచ్చే ఆహారం నాణ్యత లోపిస్తుందని, నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం నెలకు ఒకసారి అయినా ఫుడ్ అధికారులు, మున్సిపల్ అధికారులు వసతిగృహాలను సందర్శిస్తే వీరు ఇచ్చే ఆహారం ఏ విధంగా ఉంటుందో అర్ధమవుతుందన్నారు. హాస్టళ్లలో రాత్రి మిగిలిన అన్నాన్ని కిచిడిగా మార్చుతున్నారని, పరిశుభ్రత పాటించకుండా నాణ్యత లేని నిత్యావసర వస్తువులను నాసిరకం వాడుతున్నారని, దీంతో విద్యార్థులకు నష్టం జరిగిందన్నారు. ఇంత జరిగినా శ్రీ చైతన్య కళాశాల చైర్మన్ అస్వస్థకు గురైన విధ్యార్థులను పరామర్శించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి కిందిస్థాయి అధికారులను ఆదేశించి ప్రతి హాస్టళ్లలో తనిఖీలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అస్వస్థకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. లేని పక్షంలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో అతుల్ కుమార్ అంజాన్‌కు నివాళి




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అతుల్‌కుమార్ అంజాన్‌కు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అతుల్‌కుమార్ అంజాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, అఖిల భారత రైతు సంఘం జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన అంజాన్ కుమార్ ఇటీవల మరణించిన విషయం విధితమే. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ విద్యార్థి, యువజన ఉద్యమాల నుంచి అతుల్‌కుమార్ అంజాన్ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తూ వచ్చారన్నారు. అంజాన్‌కుమార్ నిబద్ధత గల కమ్యూనిస్టు అని రైతాంగ సమస్యలపై అవగాహన కలిగిన అంజాన్ వాటి పరిష్కారం కోసం కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని, మరపురానివని నారాయణ తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతిగృహాలపై చిన్నచూపు

### 14 ఏళ్లుగా పెరగని కాస్మోటిక్ చార్జీలు
### విద్యార్థుల బోధన ఫీజులు తక్షణమే విడుదల చేయాలి : ఎఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఎఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా కన్వీనర్ కైలాష్ ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల బోధన ఫీజులు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లుగా కాస్మోటిక్ చార్జీలు పెంచడం లేదన్నారు. బాలికలకు రూ. 75, బాలురకు రూ.50 మాత్రమే నెలకు చెల్లిస్తోందన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచాలంటూ గత ప్రభుత్వం ఆమోదం తెలిపినా, ఉమ్మడి రాష్ట్రంలో 2008 మార్చిలో అమలు చేసిన కాస్మోటిక్ చార్జీలనే ఇప్పటికి అమలు చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదివే సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలపై ప్రభుత్వం దురుద్దేశ్యంతోనే ఎలాంటి చార్జీలను పెంచడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించి గత పది నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో డిగ్రీ, పీజీతో పాటు వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా కళాశాల యజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బోధన ఫీజులు, ఉపకార వేతనాల బకాయిలు నాలుగేళుగా విడుదల చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారిందన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంవత్సరంలో జారీ చేసిన బిల్లులకు సంబంధించిన ఎక్కడి టోకెన్లను అక్కడే ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభించిందో ఈ ప్రభుత్వం కూడా అదే విధానాలను అవలంబిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలలు పాలనలో విద్యా రంగానికి ఒరింగిందేమి లేదన్నారు. ఇప్పటికయిన ప్రభుత్వం స్పందించి తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బాకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, వినోద్, నవీన్ పాల్గొన్నారు.

# సింగరేణి స్థలం కబ్జాపై ఎమ్మెల్యేకు ఎఐవైఎఫ్ వినతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం మండలం మల్కాపూర్ శివారు సర్వేనెంబర్ 83 లో గల సింగరేణి స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాక్కాన్‌సింగ్ ఆదివారం ఎఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన్న కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ రామగుండం మండలం మల్కాపూర్ శివారు సర్వే నెంబర్ 83లో గల సింగరేణి స్థలం సాయి లీల బార్ అండ్ రెస్టారెంట్ కు ఆనుకొని ఉండడం వల్ల ఆ స్థలం కనబడకుండా చుట్టూ చెట్లు నాటి దానినీ పార్కింగ్ స్థలంగా వాడుకుంటూ కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సుమారు రెండు కోట్లు విలువ చేసే ఆ స్థలాన్ని కాపాడడానికి వెంటనే స్పందించి ఆ స్థలం చుట్టూ ప్రహరి నిర్మాణం చేయాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రధాన రహదారి వెంట సింగరేణి స్థలాలు కబ్జాకు గురవుతున్న సింగరేణి అధికారులు వాటిపై దృష్టి సారించకపోవడం విచారకరణమన్నారు. సింగరేణి స్థలానికి కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించడం లేదని ఎమ్మెల్యేకు తెలిపారు. విలువైన సింగరేణి భూములు అనేకం కబ్జాలకు గురవుతున్నాయని దీని వెనుక సింగరేణి ఎస్టేట్ అధికారుల ఉన్నతాధికారుల అవినీతి ఉందని ఆరోపించారు. సింగరేణి ఏరియాల్లో చిన్న రేకుల షెడ్డు వేసుకుంటేనే అప్పటికప్పుడు అక్కడ వాలిపోయే ఎస్ అండ్ పిసి అధికారులు, కోట్ల రూపాయల విలువ చేసే సింగరేణి భూములు కబ్జాకు గురవుతున్న కనీసం అటువైపు చూసే పరిస్థితి లేకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఆ స్థలంపై సమగ్ర విచారణ జరిపి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌జీ వన్ జీఎంకి ఫోన్ చేసి వెంటనే సింగరేణి స్థలాన్ని కాపాడాలని ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు తాళ్లపెల్లి సురేందర్, రాణవేని సుధీర్‌కుమార్, పోతరాజు నాగరాజు, తొట్ల సురేష్ పాల్గొన్నారు.

# అమల్లోకి కొత్త చట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

రానున్నాయని వెల్లడించారు. చట్టాలు కేవలం పేరు మార్పుకే పరిమితం కాదని, చట్టాల్లో పూర్తి సవరణలను తీసుకొచ్చామన్నారు. ఈ నూతన చట్టాలను పూర్తిగా భారతీయులే రూపొందించారని, దీని ఆత్మ, శరీరం పూర్తిగా భారతీయమేనని అన్నారు. ఈ కొత్త చట్టాలు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని నిర్ధరిస్తాయని హోం మంత్రి తెలిపారు.

**ఈ నిబంధనలు ప్రత్యేకం...** ఈ కొత్త చట్టాల ప్రకారం క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తైన 45 రోజుల్లోపు తీర్పు ఇవ్వాలి. మొదటి విచారణ నుంచి 60 రోజులలోపు అభియోగాలు నమోదు చేయాలి. అత్యాచార బాధితుల వాంగ్మూలాన్ని సంరక్షకుల సమక్షంలో మహిళా పోలీసు అధికారి నమోదు చేయాలి. అత్యాచార బాధితురాలి వైద్య నివేదికలు ఏడు రోజుల్లో రావాలి. పిల్లలను కొనడం, విక్రయించడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి జీవిత ఖైదు లేదా మరణశిక్ష విధిస్తారు. భారతీయ శిక్షాస్మృతిలోని 511 సెక్షన్ల స్థానంలో ఇప్పుడు 358 సెక్షన్లు మాత్రమే ఉంటాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 18 సెక్షన్లు ఇప్పటికే రద్దు చేశారు.

**డిజి లాకర్‌లో సాక్ష్యాలు భద్రం...** సాక్షుల వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్ష్యాలన్నింటినీ జాతీయస్థాయిలో ఏర్పాటు చేసిన డిజీ లాకర్‌లో భద్రపరుస్తారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ ద్వారా ఇప్పటికే దేశవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లను అనుసంధానం చేయడం వల్ల సాక్ష్యాలను ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. దీనివల్ల ఆధారాలు మాయం చేయడం సాధ్యం కాదు. పెళ్లి చేసుకుంటానన్న తప్పుడు వాగ్దానాలు ఇచ్చి లైంగిక సంబంధాలు పెట్టుకుని మహిళలను విడిచిపెట్టే వారికి కూడా కొత్త చట్టాల్లో కఠిన నిబంధనలు రూపొందించారు. జీరో ఎఫ్ఐఆర్‌ను ప్రవేశపెట్టడం వల్ల ఒక వ్యక్తి అధికార పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీసు స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్ దాఖలు చేయవచ్చు. కొత్త చట్టాల ప్రకారం మహిళలపై నేరాలకు సంబంధించి బాధితులు కేసు పురోగతిపై 90 రోజులలోపు అప్‌డేట్ పొందేందుకు అవకాశం కల్పించారు. క్రిమినల్ కేసుల విచారణలో ఆలస్యాన్ని నివారించేందుకు కోర్టులు గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేయాలి. ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు, నేరం ద్వారా సంక్రమించిన సొమ్ముతో వారు కొన్న స్థిర, చరాస్తులనూ జప్తు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది.

# పాలనలో ప్రణాళిక శాఖ పాత్ర కీలకం : చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రణాళిక శాఖ పాత్ర కీలకమని, ఈ శాఖ రూపొందించే గణాంకాలు, క్షేత్ర స్థాయి సర్వేలు రాష్ట్ర పాలనకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. హైదరాబాద్,ఖైరతాబాద్ లోని అర్థ గణాంక శాఖ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆ శాఖ డైరెక్టర్ దయానంద్ పదవీ విరమణ, ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా దయానంద్‌ను ఆయన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అర్థ,గణాంక శాఖలో 35 సంవత్సరాల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న దయానంద్ దక్షతను గుర్తించి ప్రభుత్వంలో రానున్న రోజుల్లో తగిన గుర్తింపు దక్కుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ, అనుబంధ సంస్థల వివరాలు, భూముల గణాంకాలు, మనుషులు, పశు, పక్షుల సంపద, ప్రభుత్వ ఆస్తుల వివరాలు, జనాభా లెక్కలు సహా అనేక వివరాలు ప్రణాళికా శాఖ సేకరించి, ప్రతి ఏటా ప్రచురణకు విడుదల చేస్తుందని చిన్నారెడ్డి తెలిపారు. సివిల్స్, గ్రూప్స్, ఇతర పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రణాళికా శాఖ ప్రచురణలు ఎంతో ఉపయోగకరమన్నారు.

# గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రికి తెలియజేశారు. స్మార్ట్ సిటీలో చేపట్టిన పనులు పూర్తి కానందున, ప్రజా ప్రయోజనార్థం ఈ పనులు పూర్తయ్యే వరకు మిషన్ గడువు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు స్పందించిన కేంద్రం స్మార్ట్ సిటీ మిషన్‌ను 2025 మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ శనివారం రాష్ట్రాలకు లేఖ రాసింది. ఇప్పటికే నిధులు కేటాయించి ఆమోదించిన పనులను కొనసాగించాలని, కొత్త పనుల మంజూరు ఉండవని ఈలేఖలో స్పష్టం చేసింది. జరుగుతున్న పనులకు సంబంధించిన నిధులను ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిన విడుదల చేస్తుంది. అందుకే వీలైనంత త్వరగా ఈ పనులను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది.

ఖట్టర్‌కు బండి ధన్యవాదాలు... దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీ మిషన్‌ను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌లకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్రనిర్ణయం వల్ల కరీంనగర్, వరంగల్ పట్టణాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి అయ్యే అవకాశాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ నిధులను విడుదల చేయాలని గతంలో తాను మూడుసార్లు లేఖ రాశానని, కరోనా వల్ల రెండేళ్ల కాలం వృధా కావడంతో స్మార్ట్ సిటీ మిషన్‌ను పొడిగించాలని కోరడం జరిగిందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తుల పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వచ్చే మార్చి నెలాఖరు వరకు స్మార్ట్ సిటీ మిషన్‌ను పొడిగించినందుకు సంతోషంగా ఉందన్నారు. కేంద్ర నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాలకు మహర్దశ రానుందన్నారు.

# 'టీచర్ల' కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసిన విషయం తెలిసిందే.

ఒక్క విద్యార్థి లేని పాఠశాలకు ఇక ఉపాధ్యాయులను కేటాయించకుండా జాగ్రత్త పాటించింది.అలాగే ప్రతి పది మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున బదిలీలు చేపట్టనున్నారు. ఇందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల కంటే ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలలో చేరితే. వారికి అనుగుణంగానే ఉపాధ్యాయుల కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గత ప్రభుత్వ హయాంలో 019 వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒకరు, 20 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఇద్దరు, 61 నుంచి 90 వరకు విద్యార్థులు కలిగిన పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా 2015, జూన్, 27న .జిఒ నం:17,అలాగే 2021,ఆగస్టు21న జిఒ నం: 25ను ప్రభుత్వం జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ విధానంతో చాల ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు, మరి కొన్ని పాఠశాలల్లో తక్కువ విద్యార్థులు ఉన్నప్పటికీ ఎక్కువ మంది ఉపాధ్యాయులు, ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాల్లో తక్కువ మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. తద్వారా నాణ్యతా ప్రమాణాలు బాగా తగ్గుతున్నాయని పాఠశాల విద్యా శాఖ గుర్తించింది. అందుకే పాత విధానానికి స్వస్తిపలకాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాత బదిలీల విధానంలో పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు తీసుకొచ్చింది. విద్యార్థుల సంఖ్యను కుదించింది. గతంలో 0 నుంచి 19 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒక ఉపాధ్యాయున్ని కేటాయించగా ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యను పదికి కుదించింది. విద్యార్థుల సంఖ్య, వారికి మెరుగైన విద్యా బోధనను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టనున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎ.దేవసేన తెలిపారు.

**విద్యార్థుల సంఖ్య- ఉపాధ్యాయుల కేటాయింపు**

1 నుంచి 10 మంది విద్యార్థులు ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 40 మంది విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులు, 41 నుంచి 60మంది విద్యార్థులు ముగ్గురు ఉపాధ్యాయులు, 61పైన విద్యార్థులు ఉంటే ఆ పాఠశాలకు మంజూరైన అన్ని పోస్టుల భర్తీ.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com